

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
జయశంకర్ భూపాలపల్లి
శనివారం 27 సెప్టెంబరు 2025











ఘనమైన చరిత్రతో పాటు అద్భుతమైన ప్రాకృతిక అందాలను సొంతం చేసుకున్న జిల్లా ఓరుగల్లు. ఆదిమానవుల నుంచి రాచరికం వరకు ఎన్నో కట్టడాలు ఇక్కడ సాక్షీభూతంగా కనిపిస్తాయి. విశ్వవిఖ్యాత వారసత్వ సంపదకు నెలవుగా ఓరుగల్లు విలసిల్లుతోంది. అయితే ఆ స్థాయిలో పర్యాటకం మాత్రం అభివృద్ధి చెందడం లేదు. మౌలిక సదుపాయాలకు నోచుకోవడం లేదు. దీంతో దేశ విదేశాల నుంచి వచ్చే పర్యాటకులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. దీంతో ఓరుగల్లు టూరిజం బ్రాండ్ వ్యాల్యూ ఆశించినంతగా ఆదరణ పొందడం లేదు. ఉమ్మడి జిల్లాను పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దుతామని గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన ప్రకటనలు నీటిమూటలే అయ్యాయి. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే తరహాలో వ్యవహరిస్తోంది. ఎంపిక చేసిన కొన్ని పర్యాటక ప్రాంతాలకు మాత్రమే నిధులిస్తున్న ప్రభుత్వం.. మిగతా వాటి విషయంలో శీతకన్ను వేస్తోంది. దీంతో ఆ ప్రాంతాలు అభివృద్ధికి నోచుకోవడం లేదు. 'సెప్టెంబరు 27' ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని పర్యాటక ప్రాంతాలు, వాటి దయనీయ స్థితిపై ప్రత్యేక కథనం....

వెళ్లివిరియని పర్యాటకళ

- కొత్త జిల్లాల్లో ఇప్పటికీ ఏర్పాటు కాని టూరిజం ఆఫీసులు
- సిబ్బంది కొరతతో కొరవడుతున్న పర్యవేక్షణ
- అభివృద్ధికి నోచని పర్యాటక ప్రాంతాలు
- ఉమ్మడి జిల్లాలో పలు దర్శనీయ స్థలాలు
- నిత్యం వేల సంఖ్యలో పర్యాటకుల రాక
- అయినా పర్యాటకాభివృద్ధిలో వెనుకబాటు
- నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం

హనుమకొండ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కాకతీయుల కాలం నాటి ఎన్నో అపురూప ప్రాచీన కట్టడాలు.. ప్రకృతి రమణీయతను పంచే సరస్సులు.. మనసులను ఓలలాడించే జలపాతాలు.. చరిత్రకు ఆనవాళ్లుగా నిలిచిన కళాఖండాలు.. సుప్రసిద్ధ దేవాలయాలు.. ఎన్నో ఉమ్మడి జిల్లాకు మణిహారాలుగా వెలుగొందుతున్నాయి. అనేక పర్యాటక ప్రాంతాలకు నిలయమైన ఉమ్మడి జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు నిత్యం వేలాది మంది పర్యాటకులు వస్తుంటారు. హనుమకొండలోని వేయిస్తంభాల గుడి, పద్మాక్షి దేవాలయం, ఐనవోలు, ములుగు జిల్లాలోని యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప, అందాలొలికించే లక్నవరం సరస్సు, బొగత జలపాతం, మహబూబాబాద్ జిల్లాలోని పాండవుల గుట్టలు, వరంగల్‌లోని భద్రకాళి దేవాలయం,

నిధులు లేక నీరసిస్తున్న టూరిజం రంగం

వరంగల్ కోట తదితర ప్రదేశాలు మొదటి స్థానంలో ఉన్నాయి. ఎటొచ్చి పర్యాటకాన్ని అభివృద్ధి చేసే ప్రోత్సాహమే ప్రభుత్వం నుంచి లేదు. దర్శనీయ స్థలాల్లో కనీస సౌకర్యాలు లేక సందర్శకులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉంది.


టూరిజం ఆఫీసులు ఏవీ?

రాష్ట్ర ఆవిర్భావం అనంతరం బీఆర్ఎస్ హయాంలో జిల్లాల విభజన జరిగింది. కానీ నేటికీ ఈ జిల్లాల్లో పర్యాటక శాఖ కార్యాలయాలు ఏర్పాటు కాలేదు. జిల్లాల పునర్విభజన (మిగతా 7లో..)



వేధిస్తున్న నిధుల లేమి

పర్యాటక శాఖ తీవ్ర నిధుల కొరతను ఎదుర్కొంటోంది. పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ఎలాగో ప్రభుత్వం నిధులు ఇవ్వడం లేదు. ఉమ్మడి జిల్లాలో యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయానికి, సమ్మక్క, సారలమ్మ జాతర, లక్నవరం, పాకాల పర్యాటక ప్రాంతాలకు మాత్రమే నిధులు విడుదలవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలోని మరే పర్యాటక ప్రాంత అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఒక్క పైసా కూడా రావడం లేదు. దీనితో జిల్లా పర్యాటక శాఖ ఉనికి నామమాత్రంగా మిగిలిపోతోంది.



సింగరేణి కార్మికులకు

దీపావళి బోనస్

ఒక్కో కార్మికుడికి రూ.1.03 లక్షలు

భూపాలపల్లి ఏరియాకు రూ.54.59 కోట్ల లబ్ధి

కృష్ణకాలనీ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికులకు యాజమాన్యం మరో శుభవార్త చెప్పింది. ఇప్పటికే లాభాల వాటాతో పాటు దసరా బోనస్ ప్రకటించిన విషయం విదితమే. తాజాగా శుక్రవా రం దీపావళి బోనస్‌ను సైతం ప్రకటించింది. అన్ని యూనియన్లతోను దీర్ఘంగా చర్చలు జరిపి ఈ నిర్ణయాన్ని తీసుకుంది. తొలుత రూ.98,500 మాత్రమే ప్రకటించేందుకు ఆలోచన చేయగా వివిధ యూనియన్లు ఒత్తిడి తెచ్చాయి. ఈ నేపథ్యంలో మరో రూ.9,250 పెంపుదల చేసి రూ.1,03,000 ప్రకటించింది. దీంతో భూపాలపల్లి ఏరియాలో సుమారు 5,300 మంది కార్మికులు ఉండగా రూ.1,03,000 చొప్పున రూ.54.59 కోట్ల లబ్ధి చేకూరనుంది. కాగా, 240, 190 మస్టర్లు తక్కువ చేసిన కార్మికులకు ఆయా బేసిక్‌ను బట్టి బోనస్ జమ కానున్నట్లు తెలిసింది. మొత్తంగా దీపావళి బోనస్ పెంపులతో తమదంటే తమదే పాత్ర కీలకమని పలు సంఘాల నాయకులు తమ అభిప్రాయాల్ని కార్మికుల్లోకి తీసుకెళ్తున్నారు. మరోవైపు కార్మికులకు దసరా బోనస్ రూ.25వేలు, లాభాల వాటాలో 34 శాతం సంస్థ ప్రకటించిన విషయం విదితమే.

మద్యం దుకాణాలకు

రిజర్వేషన్ల ఖరారు

- గౌడ, ఎస్సీ, ఎస్టీ, ఓపెన్ కేటగిరీలకు కేటాయింపు
- భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో 59 దుకాణాలు
- రూ.లక్ష పెరిగిన దరఖాస్తు రుసుము



కృష్ణకాలనీ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలకు సంబంధించి 2025-27 నూతన ఎక్సైజ్ పాలసీలో ఏర్పాటు చేయబోయే మద్యం దుకాణాలను రిజర్వేషన్ల ప్రకారం కేటాయింపు చేసినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ వేముల శ్రీనివాస్ ప్రకటించారు. ఈ మేరకు శుక్రవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. భూపాలపల్లి, ములుగు రెండు జిల్లాల్లో కలిపి 59 షాపులు ఈ పాలసీకి కేటాయించడం జరిగిందన్నారు. వీటిలో గౌడ్స్‌కు-09, ఎస్సీకి- 07, ఎస్టీలకు-11, ఓపెన్ కేటగిరీలో-32 ఖరారు చేసినట్లు వివరించారు. శనివారం నుంచి వీటికి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. దరఖాస్తు రుసుము గతంలో ఉన్నదానికి రూ.1 లక్ష పెంపుతో రూ.3 లక్షలు చేయడం జరిగిందన్నారు. రూ.3 లక్షలు డీడీ లేదా చలానా రూపంలో చెల్లించి మూడు కలర్ పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఆధార్‌కార్డు, పాన్‌కార్డు జిరాక్సు కాపీలు జతపరిచి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, గౌడ కులస్థులు తమకు కేటాయించబడిన మ ద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకున్నట్లయితే కుల ధృవీకరణ పత్రం తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఇతర వివరాలకు కలెక్టరేట్ కార్యాలయంలోని ఎక్సైజ్ శాఖలో సంప్రదించాలన్నారు.

నిద్రలోనే కబళించిన మృత్యువు

- బెగ్లూర్‌లో గోడ కూలి భార్య మృతి
- స్వల్ప గాయాలతో బయటపడిన భర్త





గోడ కూలడంతో ఇటుకలు మీద పడిన దృశ్యం, ఘటనా స్థలంలో లక్ష్మీ మృతదేహం

మహదేవపూర్ రూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో నిద్రిస్తున్న దంపతులపై గోడ కూలడంతో భార్య అక్కడికక్కడే మృతి చెందింది. భర్త స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఈ సంఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని బెగ్లూర్‌లో గురువారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... బెగ్లూర్ గ్రామంలో మంద లక్ష్మి(40), మంద దుర్గయ్య దంపతులు నివాసముంటున్నారు. వీరిద్దరు కొద్ది రోజులుగా అనారోగ్యం బారినపడి ఇంటి పట్టునే ఉంటున్నారు. ఈ క్రమంలోనే గురువారం అర్ధరాత్రి ఇంట్లో నిద్రిస్తున్న లక్ష్మిపై గోడ కూలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. భర్త దుర్గయ్య స్వల్ప గాయాలతో బయటపడినట్లు చెప్పారు. రాత్రి ముచ్చటించిన తన భార్య తెల్లవారేసరికి విగతజీవిగా ఉండటాన్ని చూసి దుర్గయ్య కన్నీరు మున్నీరుగా విలపించాడు. నిరుపేద అయిన దుర్గయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు. కాగా, సంఘటన స్థలాన్ని తహసీల్దార్ రామారావు, డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ, ఎస్సై శశాంక్ పరిశీలించి నష్టం అంచనా వేశారు. పోస్టుమార్టం నిమిత్తం లక్ష్మి మృతదేహాన్ని మహదేవపూర్ సామాజిక ఆసుపత్రికి తరలించారు.

బాధిత కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సాయం

గోడ కూలిన ఘటనలో మృతి చెందిన మంద లక్ష్మి కుటుంబానికి కాంగ్రెస్ నాయకుడు కట్కం అశోక్ రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశానుసారం సాయాన్ని కుటుంబానికి అందించినట్లు ఆయన తెలిపారు. బాధిత కుటుంబానికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

స్థానిక ఎన్నికలపై అవగాహన కలిగి ఉండాలి

- భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ
- కలెక్టరేట్‌లో పీవో, ఏపీవోలకు శిక్షణ

భూపాలపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియపై పీవో, ఏపీవోలు అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. భూపాలపల్లిలోని కలెక్టరేట్‌లో శుక్రవారం పీవో, ఏపీవోలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతూ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సన్నద్ధంగా ఉండాలన్నారు. ఎన్నికల ప్రక్రియ చాలా ముఖ్యమని, ఎలాంటి పొరపాట్లు లేకుండా ఎన్నికలు నిర్వహించేందుకు సిబ్బంది స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల సంఘం సూచనల మేరకు సిబ్బందికి శిక్షణ నిర్వహించడం జరుగుతుందన్నారు. బ్యాలెట్ పేపర్ పద్ధతిలో ఎన్నికలు ఉంటాయని, పోలింగ్ కేంద్రాల్లో చేయాల్సిన ఏర్పాట్లు, పోలింగ్ నిర్వహణ అంశాలపై మాస్టర్ ట్రైయినర్లు సమగ్రంగా పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరిస్తారని, సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీపీఆర్‌వో శ్రీనివాస్, సీపీవో బాబురావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలోని చెరువులు, కుంటలు భద్రం

భూపాలపల్లి కలెక్టరేట్(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కురుస్తున్న వర్షాలతో చెరువులు, కుంటలకు ఎటువంటి నష్టం జరగలేదని, అన్నీ పటిష్టమైన స్థితిలోనే ఉన్నాయని కలెక్టర్ రాహుల్‌శర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో చెరువులు తెగిపోయాయనే అసత్య ప్రచారాలు సోషల్ మీడియా వేదికగా జరగడంపై స్పందించిన కలెక్టర్ అవన్నీ ఫేక్ న్యూస్ అన్నారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఇరిగేషన్ అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని క్షేత్రస్థాయిలో సమీక్షిస్తున్నారన్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోషల్ మీడియాలో భూపాలపల్లి మండలం భీమ్‌ఘనపూర్ చెరువు తెగిపోయిందనే వదంతుల నేపథ్యంలో శుక్రవారం ఇరిగేషన్ ఈఈ బసవ ప్రసాద్ చెరువును సందర్శించి ఎటువంటి ముప్పు లేదని తెలిపారు. అసత్య ప్రచారాలను నమ్మవద్దని ప్రజలకు సూచించారు.

చాకలి ఐలమ్మ గొప్ప పోరాట యోధురాలు

130వ జయంతి వేడుకల్లో ములుగు కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వీరనారి చాకలి ఐలమ్మ గొప్ప పోరాట యోధురాలని, ఆమె ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని కలెక్టర్ టీఎస్.దివాకర అన్నారు. శుక్రవారం ములుగులోని కలెక్టరేట్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు జరగగా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాకలి ఐలమ్మ వీరోచిత పోరాటం ఎప్పటికీ మర్చిపోలేనిదని, ఆమె ధైర్య సాహసాలు, సమానత్వం కోసం చేసిన త్యాగం నేటి తరాలకు స్ఫూర్తిగా నిలవాలన్నారు. భూహక్కుల కోసం పోరాడిన తొలి మహిళా పోరాట యోధురాలిగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచారన్నారు. ఈ తరం యువత ఆమె స్ఫూర్తిని అనుసరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఎం.సర్ధార్‌సింగ్, మణికంఠ రజక సంఘం, చాకలి ఐలమ్మ జయంతి నిర్వహణ కమిటీ అధ్యక్షుడు నగరపు రమేష్, ఉపాధ్యక్షుడు పరికిరాల రవి, ప్రధాన కార్యదర్శి చాపర్తి రాజు, కోశాధికారి ఎన్నిండ్ల మహేందర్, రజక సంఘం మహిళా అధ్యక్షురాలు బండి అరుణ, సహాయ కార్యదర్శి గూడెల్లి ఓదెలు, కొత్తపెల్లి దయాకర్, సలహాదారులు నేరెళ్ల శంకర్, జాలిగం శ్రీనివాస్, కమిటీ సభ్యులు పావురాల భిక్షపతి, వడ్డెపల్లి సారంగపాణి, నాంపెల్లి స్వామి, పైనాల సదానందం, బీసీ వెల్ఫేర్ ఉద్యోగులు పొడాలు, కుమారస్వామి, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



ములుగు కలెక్టరేట్‌లో ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ దివాకర



భూపాలపల్లి కలెక్టరేట్‌లో చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎమ్మెల్యే గండ్ర

వీరనారి చాకలి ఐలమ్మ : ఎమ్మెల్యే గండ్ర

భూపాలపల్లి కలెక్టరేట్(ఆంధ్రజ్యోతి): చాకలి ఐలమ్మ పోరాట పటిమను, పట్టుదలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం భూపాలపల్లి కలెక్టరేట్‌లో నిర్వహించిన చాకలి ఐలమ్మ 130వ జయంతి వేడుకల్లో కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి పాల్గొన్న ఎమ్మెల్యే గండ్ర ఐలమ్మ చిత్రపటానికి పూలమాల నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చాకలి ఐలమ్మ జయంతిని అధికారికంగా జరుపుకోవడం చాలా సంతోషం ఉందన్నారు. మహిళా యూనివర్సిటీకి చాకలి ఐలమ్మ పేరు పెట్టి ప్రభుత్వం సముచిత స్థానంతో గౌరవించిందన్నారు. దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ పోరాటాల ఫలితమే రాష్ట్రం ఏర్పాటుకు కారణం అన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి ఇందిర, వివిధ కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అవమానం భరించలేక దళిత రైతు ఆత్మహత్య

- ఆవు తన పాలంలో మేసిందని మరో రైతు ఆగ్రహం
- కులం పేరుతో దూషించి, దాడి
- ఫిర్యాదు చేసినా పోలీసులు స్పందించలేదని బాధితుడి మనస్తాపం
- ఈ నెల 16న ఆత్మహత్యాయత్నం.. చికిత్స పొందుతూ మృతి



భిక్షపతి (ఫైల్)

గణపురం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కులం పేరుతో దూషించడమే కాకుండా, భౌతికంగా దాడి చేయడాన్ని తట్టుకోలేక ఓ దళిత రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన భూపాలపల్లి జిల్లా గణపురం మండలం ధర్మారావుపేటలో చోటు చేసుకుంది. కుటుంబసభ్యులు, గ్రామస్థులు తెలిపిన ప్రకారం... గ్రామానికి చెందిన బొల్లం భిక్షపతి అనే రైతుకు రెండు ఆవులు ఉన్నాయి. పది రోజుల క్రితం అదే గ్రామానికి చెందిన పూజారి బాబు (బీసీ సామాజికవర్గం) అనే రైతు పొలంలోకి భిక్షపతికి చెందిన ఆవు వెళ్లి మేసింది. ఈ క్రమంలో దానిని చూసిన బాబు వెంటనే అక్కడికి చేరుకుని ఆవును వెళ్లగొట్టాడు. అనంతరం భిక్షపతిని పిలిచి అడగగా, భిక్షపతి తప్పు జరిగింది వాస్తవమేనని ఒప్పుకున్నాడు.

అయినప్పటికీ బాబు కోపోద్రిక్తుడై కర్రతో భిక్షపతిపై దాడి చేయడమే కాకుండా కులం పేరుతో దూషించాడు. దీంతో భిక్షపతి పోలీసులకు (మిగతా 8వ పేజీలో)



రామన్నగూడెం పుష్కర ఘాట్ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

గోదావరి ఉగ్రరూపం

- మొదటి ప్రమాద హెచ్చరికను దాటి ప్రవాహం

ఏటూరునాగారం రూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : గోదావరి నది ఉగ్రరూ పం దాల్చింది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరిలోకి వరద ఉధృతి పోటెత్తుతోంది. మండలంలోని రామన్నగూడెం పుష్కర ఘాట్ వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. మొదటి ప్రమాద హెచ్చరికను దాటి ప్రవాహం కొనసాగుతుంది. శుక్రవారం ఉదయం 6 గంటలకు పుష్కర ఘాట్ వద్ద గోదావరి నీటిమట్టం 14.960 మీటర్లకు చేరడంతో జలవనరుల శాఖ అధికారులు మొదటి ప్రమా ద హెచ్చరికను జారీ చేశారు. మధ్యాహ్నం 2 గంటలకు గోదావరి నీటిమట్టం 15.240 మీటర్లకు చేరి సాయంత్రం 6 గంటలకు 15.280 మీటర్లకు చేరుకొని గోదావరి ప్రవాహం కొనసాగుతోంది. ప్రవాహం వేగంగా పెరగడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. 15.820 మీటర్లకు నీటిమట్టం చేరితే రెండవ ప్రమాద హెచ్చరికను అధికారులు జారీ చేయనున్నారు.

బ్యారేజీలకు పెరుగుతున్న వరద

కన్నాయిగూడెం(ఆంధ్రజ్యోతి): మండలంలోని తుపాకులగూడెం వద్ద ఉన్న సమ్మ క్క సాగర్ బ్యారేజీ, గుట్టల గంగారం (మిగతా 8లో..)



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వీరయ్య

పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలి

సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు అల్వాల వీరయ్య

మరిపెడ రూరల్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు అల్వాల వీరయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని ఎల్లంపేటలో అల్వాల పురుషోత్తం అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించగా వీరయ్య మాట్లాడారు. ఎల్లంపేటలో ఏప్రిల్ నెలలో రెండు వారాల నుంచి నాలుగు వారాలుచేసిన పనికి కూలీల డబ్బులు చెల్లించకుండా అధికారులు కాలయాపన చేస్తున్నారని దుయ్యబట్టారు. అదే విధంగా మండల వ్యాప్తంగా వేల సంఖ్యలో కూలీలకు లక్షలాదిరూపాయలు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని చెల్లిస్తే కూలీలు దసరా పర్వదినాన్ని ఘనంగా జరుపుకుంటారన్నారు. లేనట్లయితే దశలవారీగా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఎం మండల నాయకులు బాణాల రాజన్న, తాడూరి వీరేంకులు, లాలయ్య, కొమరయ్య, యాకయ్య, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

హలో లంబాడా.. చలో మానుకోటను జయప్రదం చేయాలి



చిన్న గూడూరు మండలంలో మాట్లాడుతున్న సురేష్

మరిపెడ రూరల్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో నేడు (ఆదివారం) జరగబోయే హలో లంబాడా.. చలో మానుకోటను లంబాడ సోదరు లు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఎల్‌హెచ్‌పీఎస్ నియోజకవర్గ నాయకుడు భూక్యా రామ్మూర్తినాయక్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని భూక్యా తండా జీపీలో ఆయన మాట్లాడారు. లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించేందుకు అధికార పార్టీ కుట్ర పన్నుతోందన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా గిరిజన విద్యావంతులు, ఉద్యోగస్తులు, జాతీ మేధావులు, విద్యార్థులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

● చిన్నగూడూరు(ఆంధ్రజ్యోతి): లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలనే కుట్రను తిప్పికొడుతూ జిల్లా కేంద్రంలో నేడు జరిగే లంబాడీల ఆత్మగౌరవ సభకు భారీగా తరలిరావాలని మండల సేవాలాల్ సేన అధ్యక్షుడు బాదావత్ సురేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని మేగ్యాతండాలో ప్రచారం చేసి మానుకోట సేవలాల్ సేన సభ్యులతో కలిసి ఆత్మగౌరవ సభ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో లంబాడా జేఏసీ, సేవలాల్ సేన నాయకులు పాల్గొన్నారు.

జల్సాల కోసం దొంగతనాలు

● ఇద్దరి అరెస్టు ● 5తులాల బంగారం, లక్షా నలభై వేల నగదు స్వాధీనం ● వివరాలు వెల్లడించిన డీఎస్పీ కృష్ణకిషోర్

నర్సింహులపేట, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): జల్సాలకు అలవాటు పడి సులువుగా డబ్బులు సంపాదించాలని వరస దొంగతనాలకు పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తొర్రూరు డీఎస్పీ కృష్ణకిషోర్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. మండలంలోని నర్సింహపురం బంజర గ్రామ శివారు పత్ని తండాకు చెందిన గుగులోతు సాగర్, మండలంలోని రామన్నగూడెం గ్రామానికి చెందిన గోడిశాల దేవేందర్‌లు జనవరి 27న పత్ని తండాకు చెందిన గుగులోతు రామారావు ఇంట్లో తాళం పగలగొట్టి బీరువాలో ఉన్న 2.33 లక్షల నగదును దొంగిలించారు. ఈనెల 20న రామన్నగూడెం గ్రామానికి చెందిన గోడిశాల రమేష్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలో ఉన్న 3 తులాల నల్లపూసల గొలుసు, తులం చెవి కమ్మలు, తులం రింగు మొత్తం 5 తులాల బంగారు వస్తువులు దొంగిలించారు. గుగులోతు రామారావు, గోడిశాల రమేష్‌లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

సాగర్ గతంలో కూడా పలు దొంగతనాలకు పాల్పడగా, పోలీసులు ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారు. దీంతో వారి వద్ద నుంచి 5తులాల బంగారు వస్తువులతో పాటు 1.40వేల నగదు, కారు, 3ఫోన్లు, ఒక పెట్రోల్ బాటిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ చెప్పారు. కాగా సాగర్ ఈనెల 23న కొమ్ములవంచ సబ్‌స్టేషన్‌లో విధుల్లో ఉన్న ఏఈ పాండు నాయక్‌తో తమ ఇంట్లో కరెంట్ ఎలా కట్ చేస్తారని గొడవకు దిగి పెట్రోల్ పోసి సబ్‌స్టేషన్ తగల పెడతానని బెదిరించాడు. దీంతో తన విధులకు ఆటంకం కలిగించి బెదిరింపులకు పాల్పడ్డాడని ఏఈ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐ గణేష్, ఎస్సై సురేష్, హెడ్ కానిస్టేబుల్ బాలాజీ, సిబ్బంది మారిపెల్లి రమేష్, తప్పెట్ల రమేష్, లక్ష్మణ్, రవి కుమార్, చంద్రయ్య, మమత, ఉష, ప్రవీణ్, నయీంపాష పాల్గొన్నారు.



పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించిన డీఎస్పీ కృష్ణకిషోర్

అడిగిన వరాలు ఇచ్చే దేవత దుర్గమ్మ తల్లి

ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ సతీమణి ప్రమీల



దుర్గామాతకు పూజలు చేస్తున్న ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్ సతీమణి డాక్టర్ ప్రమీల

మరిపెడ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : భక్తులకు అడిగిన వరాలు ఇచ్చే దేవత దుర్గమ్మతల్లి అని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ సతీమణి డాక్టర్ ప్రమీల అన్నారు. గురువారం రాత్రి శరన్నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా ఆమె మరిపెడ మండల్ పరిషత్ ఆవరణలో ఏర్పాటు చేసిన దుర్గా మాతకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రసాద్‌శర్మ అమ్మవారికి అర్చనలు, అభిషేకం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేశారు. డాక్టర్ ప్రమీల వెంట మరిపెడ 9వ వార్డు మాజీ కౌన్సిలర్ ప్రగతి శ్రీపాల్‌రెడ్డి, అల్వాల ఉపేందర్, కొంపెల్లి సురేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు. అదే విధంగా శుక్రవారం మరిపెడ శివాలయంలోని దుర్గా మాతకు తహసీల్దార్ కృష్ణవేణి పూజలు జరిపి గంధ సిరి లింగమూర్తి-ఉపేంద్ర దంపతులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అర్చకులు రఘురామ్‌శర్మ, ఆర్‌ఎ శరత్, మహిపాల్‌రెడ్డి, సతీశ్, లక్ష్మీనారాయణ, రమేశ్, నరేశ్, హరీశ్, స్టాలిన్, మహేశ్, చంద్రయ్య, చరణ్, నాగరాజులు పాల్గొన్నారు.

● తొర్రూరు (ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రి ఉత్స వాల్లో భాగంగా గత 5రోజులుగా పట్టణంలోని భద్రకాళి ఆలయం, వాసవీమాత ఆలయం, గాయత్రీ మాత ఆలయంలో అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలతో పూజలు, అర్చన, అభిషేకాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం 5వ రోజు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. వాసవీ మాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాద వితరణ చేపట్టారు. గాయత్రీ ఆలయంలో మహిళలు కుంకుమ పూజ నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈకార్యక్రమంలో ఆలయ అర్చకులు సంతోష్ శర్మ, శివశర్మ, మండపాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు

తొర్రూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు ఆధ్వర్యంలో గురువారం రాత్రి 5వ రోజు బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. లయన్స్ క్లబ్ మొదటి డిస్ట్రిక్ గవర్నర్ ఎన్. సుధాకర్ రెడ్డి హాజరై మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ అని, తీరొక్క పూలతో బతుకమ్మలు తీర్చిదిద్ది ఇంటిల్లిపాది సంబరంగా జరుపుకునే పూల పండుగ అన్నారు. బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న మహిళలకు ప్రత్యేక బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాస్ట్ డిస్టిక్ గవర్నర్ డాక్టర్ రాజేందర్ రెడ్డి, తమ్మెర శారద లక్ష్మి నర్సింహ రావు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సూర్దపు రాంనర్సయ్య, వెంకట్ రెడ్డి, వెంకన్న, విశ్వేశ్వర రావు, వెంకటేశ్వర్లు, రవీందర్ రెడ్డి, శ్రీనివాస్ ఉన్నారు.



లయన్స్ క్లబ్‌లో బతుకమ్మ ఆడుతున్న క్లబ్ సభ్యులు

నేటి ధర్నాను విజయవంతం చేయాలి

● వామపక్ష పార్టీల సంఘీభావం

తొర్రూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తొర్రూరు పట్టణంలో నిర్మించి ఉన్న డబుల్ బెడ్‌రూం ఇండ్లను అర్హులైన వారికి పంపిణీ చేయాలని కోరుతూ గత 8 రోజులుగా సీపీఎం పార్టీ, లబ్ధిదారులు చేస్తున్న నిరాహార దీక్షలకు శుక్రవారం వామపక్ష పార్టీల నాయకులు మద్దతు తెలిపారు. ఈసందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొల్లం అశోక్ మాట్లాడుతూ.. రోజులుగా నిరసన తెలుపుతున్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడం సిగ్గుచేటని, నేడు ఆర్డీవో కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాకు లబ్ధిదారులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. సీపీఐ, సీపీఐఎంఎల్, న్యూడెమోక్రసీ, బహుజన సమాజ్ పార్టీ నాయకులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఎండీ. యాకూబ్, దర్గయ్య, బందు మహేందర్, ప్రసాద్, సాయిలు, యాకయ్య, తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ దసరా బొనాంజా

తొర్రూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సద్దుల బతుకమ్మ, దసరా పండుగకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారికోసం ప్రత్యేక లక్కీడ్రా నిర్వహించడం జరుగుతుందని డిపో మేనేజర్ పద్మావతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 27 నుంచి అక్టోబరు 6 వరకు వరంగల్ రీజియన్ పరిధిలోని రాజధాని, సూపర్ లగ్జరీ, డీలక్స్, సెమీ డీలక్స్ (మహాలక్ష్మి పథకం మినహాయించి) అన్ని బస్సుల్లో ప్రయాణం చేసే ప్రయాణీకులు తమ టికెట్ వెనకభాగంలో పేరు, మొబైల్ నంబర్ రాసి బస్సులో ఉన్న డ్రా బాక్సులో వేసి డ్రాలో పాల్గొనాలన్నారు. అక్టోబరు 7న వరంగల్ రీజినల్ కార్యాలయంలో లక్కీ డ్రా ఉంటుందని, మొదటి బహుమతి రూ.25వేలు, రెండవ బహుమతి 15వేలు, 3వ బహుమతి 10వేలు అందిస్తామన్నారు. తొర్రూరు డిపో పరిధిలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆకస్మిక మంటల వ్యాప్తి, నివారణపై అవగాహన

మరిపెడ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆకస్మిక మంటల వ్యాప్తి, నివారణ చర్యలపై మరిపెడ ఫైర్‌స్టేషన్ అధికారి వీరేశ్ శుక్రవారం మరిపెడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇంట్లో గ్యాస్ సిలిండర్ నుంచి అకస్మాత్తుగా వచ్చే మంటల గురించి వివరించారు. కార్యక్రమంలో మరిపెడ ఫైర్‌స్టేషన్ సిబ్బంది రఘుపాల్‌రెడ్డి, సంతోశ్, రాజు, బాలు, బాసు తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో జనగామ విద్యార్థి ప్రతిభ

జనగామ కల్చరల్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లాలో ఇటీవల నిర్వహించిన అథ్లెటిక్స్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి ప్రతిభ కనబరిచాడు. జనగామ జిల్లా కేంద్రంలోని ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జి.సునీల్ (బీఏ ఫస్ట్‌ఇయర్) విద్యార్థి 23 నుంచి 25వరకు నిర్వహించిన 36వ సౌత్ జోన్ అథ్లెటిక్స్‌లో అండర్-18 షాట్ పుట్ విభాగంలో రజత పతకం సాధించాడు. జి.సునీల్‌ను ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్, పీడీ టి.కల్యాణి అభినందించారు.



రజత పతకం అందుకున్న సునీల్

మిర్చి రైతు కుదేలు

● వందలాది ఎకరాల్లో నీట మునిగిన పంట



పేరూరులో నీట మునిగిన మిర్చి పంటను చూపిస్తున్న రైతు

వాజేడు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గోదావరి వరదలతో మిర్చి రైతులు కుదేలయ్యారు. అకారణంగా వచ్చిన గోదావరి వరదల కారణంగా మిర్చి రైతులు తీవ్రంగా నష్టపోయారు. లోతట్టు ప్రాంతాల్లో సాగు చేసిన మిర్చి పంటను వరదలు ముంచెత్తాయి. దీంతో మండలంలోని పేరూరు, చంద్రుపట్ల, ధర్మవరం, గుమ్మడిదొడ్డి, చీకుపల్లి, వాజేడు, ఏడ్జర్లపల్లి తదితర గోదావరి పరీవాహక ప్రాంతాల్లో సాగు చేస్తున్న మిర్చి పంటను వరద ముంచెత్తింది. మూడు, నాలుగు రోజుల క్రితం మిర్చి మొక్కేతలు వేయగా ఆ మొక్కలను గోదావరి వరద ముంచెత్తడంతో మొత్తం చనిపోతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు సుమారు రూ.35వేలకు పైగా నష్టం వాటిల్లుతుందని ఆందోళన చెందుతున్నారు. మరలా మిర్చి నారు కొనాలంటే ఒక మొక్కకు రూ.2 చొప్పున అమ్ముతున్నారని, ఇప్పటికే పెట్టుబడుల రూపంలో వేలాదిరూపాయలు పెట్టామని రైతులు పేర్కొంటున్నారు.

మునకలోనే జాతీయ రహదారి

మండలంలోని టేకులగూడెం వద్ద 163వ జాతీయ రహదారి రెండో రోజు కూడా వరద నీటిలో మునిగింది. దీంతో తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అదేవిధంగా పేరూరు-చంద్రుపట్ల మధ్య ఉన్న మరిమాగు వాగు ఉధృతి కారణంగా రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వాజేడు-గుమ్మడిదొడ్డి, ఏడ్జర్లపల్లి-బొమ్మనపల్లి, కోయవీరాపురం రహదారులను సైతం వరద నీరు ముంచెత్తింది. దీంతో ఆయా గ్రామాలకు వెళ్లేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారీ వర్షాల నేపథ్యంలో కొంగాల, మురుమూరు పంచాయతీలలో స్తంభాలు నేలకొరగడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది.

గంజాయి తరలిస్తున్న యువకుడి అరెస్ట్

1.150 కిలోల సరుకు, సెల్‌ఫోన్ స్వాధీనం



పోలీసుల అదుపులో ఉన్న నిందితుడు

టేకుమట్ల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని దూల్‌పేట ఏరియా నుంచి తక్కువ ధరకు గంజాయిని తెచ్చి స్థానికంగా విక్రయించడానికి తరలిస్తున్న ఓ యువకుడిని గురువారం పోలీసులు పట్టుకున్నారు. గత కొంత కాలంగా గంజాయిని తెచ్చి అతడు తాగడమే కాకుండా పలు గ్రామాల్లో పలువురికి అధిక ధరలకు విక్రయిస్తూ విద్యార్థులు, యువకుల భవిష్యత్‌ను దెబ్బతీస్తున్న డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థి దందాకు పోలీసులు చెక్ పెట్టారు. ఎస్సై దాసరి సుధాకర్ తెలిపిన ప్రకారం... మండలంలోని రామకృష్ణాపూర్(టి)గ్రామానికి చెందిన బొమ్మ రాజేంద్రప్రసాద్(23) హనుమకొండలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. స్నేహితులతో కలిసి గంజాయి తాగడం వంటి చెడు వ్యసనాలకు అలవాటయ్యాడు. గంజాయిని హైదరాబాద్ దూల్‌పేట ఏరియా నుంచి తెచ్చి తాను తాగడమే కాకుండా పలువురికి అధిక ధరలకు విక్రయించేవాడు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్సై సుధాకర్, సిబ్బందితో కలిసి రామకృష్ణాపూర్(టి) గ్రామ శివారులో గురువారం మాటు వేశారు. ఉదయం 11.30 గంటల సమయంలో ఓ యువకుడు చిట్యాల వైపు నుంచి వస్తూ పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేయగా పట్టుకున్నారు. అతడి వద్ద తనిఖీ చేయగా 1కిలో 150గ్రాముల ఎండు గంజాయి ఉన్నట్లు గుర్తించారు. దీంతో పోలీసులు యువకుడిని ప్రశ్నించి మండలంలోని రామకృష్ణాపూర్(టి) గ్రామానికి చెందిన బొమ్మ రాజేంద్రప్రసాద్(23) హనుమకొండలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నట్లు గుర్తించారు. దీంతో పంచుల సమక్షంలో పంచనామా నిర్వహించి 1.150 కిలోల గంజాయితో సహా సెల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి రవాణా చేస్తున్న రాజేంద్రప్రసాద్‌పై కేసు నమోదు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో చిట్యాల ఎస్సై శ్రావణ్‌కుమార్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ఈజీఎస్‌లో అక్రమాలకు తావివ్వొద్దు

● డీఆర్‌డీఏ ఏపీడీ చంద్రశేఖర్



పాలకుర్తిలో మాట్లాడుతున్న అదనపు ఏపీడీ చంద్రశేఖర్

పాలకుర్తి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకం పనుల్లో అక్రమాలకు చోటులేకుండా, నిబంధనల మేరకు నడుచుకోవాలని డీఆర్‌డీఏ ఏపీడీ చంద్రశేఖర్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం సమావేశపు హాలులో నిర్వహించిన జాతీయ ఉపాధి హామీ పథకం 17వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక సభ నిర్వహించగా ముఖ్యఅతిథిగా చంద్రశేఖర్ మాట్లాడారు. మండలంలోని 36గ్రామ పంచాయతీల్లో 2024 ఏప్రిల్, 1, నుంచి 2025 మార్చి 31వరకు చేపట్టిన పనులకు ఖర్చు చేసిన నిధుల వివరాలను సభలో వివరించినట్లు తెలిపారు. రూ.73,781,725కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. కూలీలకు రూ.71,088,656 కోట్లు ఖర్చు చేసినట్లు వివరించారు. అంతే కాకుండా సామాగ్రి కొనుగోలు చేసినందుకు రూ. 269,365 లక్షలు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. సీసీరోడ్లు చేసిన పనులకు ఖర్చు రూ. 103,841,693, కోట్లు ఈనెల 15 నుంచి 26 వరకు సామాజిక తనిఖీ గ్రామాల వారీగా చేపట్టామని పేర్కొన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, ఈసీలు పనుల్లో నిర్లక్ష్యానికి పాల్పడినందుకు రూ. 53,222 వేలు ఫైన్ వేసినట్లు తెలిపారు. ఈజీఎస్ పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలని సూచించారు. చిన్న పొరపాట్లు కూడా చేయకూడదన్నారు. ఫీల్ట్ అసిస్టెంట్లు విధుల్లో నిర్లక్ష్యంగా ఉండకూడదని సూచించారు. జాబ్ కార్డులు లేని వారు దరఖాస్తు చేసుకుంటే వారంరోజుల్లో వారికి జాబ్ కార్డులిచ్చి పనులు చూపాలని మండల అధికారులకు సూచించారు. ఎస్సార్పీ కేశన్న, జిల్లా విజిలెన్స్ అధికారి సంధ్యారాణి, క్వాలిటీ కంట్రోల్ అధికారి రాజవర్ధన్‌రెడ్డి, ప్రణయ్, ఎంపీడీవో రవీందర్, ఏపీవో మంజుల, టీఏలు కొంరన్న, యాకూబ్ పాల్గొన్నారు.

ఘన్‌పూర్ మార్కెట్‌కు 6 రోజులు సెలవులు

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): స్టేషన్ ఘన్‌పూర్ వ్యవసాయ మార్కెట్‌కు ఈనెల 28 నుంచి అక్టోబరు 3వరకు సద్దుల బతుకమ్మ, దసరా పండుగను పురస్కరించుకుని ఆరు రోజులు సెలవులు ప్రకటించినట్లు మార్కెట్ చైర్మన్ జూలుకుంట్ల లావణ్య శిరీష్ రెడ్డి తెలిపారు. 28న ఆదివారం సాధారణ సెలవు, 29న సద్దుల బతుకమ్మ, 30న దుర్గాష్టమి, అక్టోబరు 1న మహర్నవమి, 2న గాంధీ జయంతి, విజయదశమి, 3న దసరా మరుసటి రోజు సెలవు ఉంటుందని పేర్కొన్నారు. 4నుంచి మార్కెట్ యథావిధిగా పునఃప్రారంభం అవుతుందని, ఈవిషయాన్ని రైతులు గుర్తించాలని పేర్కొన్నారు.

పండుగ వేళ దొంగల హల్‌చల్

మేకలు, గొర్రెలు దొంగిలించేందుకు విఫలయత్నం

మహదేవపూర్ రూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్కపల్లి గ్రామంలో కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు గురువారం అర్ధరాత్రి హల్‌చల్ చేశారు. మేకలు, గొర్రెలను దొంగిలించేందుకు విఫల ప్రయత్నం చేసి పారిపోయారు. గ్రామస్థులు తెలిపిన ప్రకారం... గురువారం అర్ధరాత్రి దాటాక రెండు బైకులపై గుర్తుతెలియని వ్యక్తులు గ్రామానికి వచ్చినట్లు తెలిపారు. ఈ క్రమంలోనే పాఠశాల సమీపంలోని ఓ ఇంటిలో మేకను ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించగా గ్రామానికి చెందిన ఓ యువకుడు గమనించి కేకలు వేస్తూ బయటకు వచ్చినట్లు తెలిపారు. ఆ యువకుడిని చూసిన దొంగలు ఓ బైకును అక్కడే వదిలేసి మరో బైకుపై పారిపోయినట్లు తెలిపారు. వదిలేసి వెళ్లిన బైకును పోలీసులకు అప్పజెప్పనున్నట్లు గ్రామస్థులు పేర్కొన్నారు. కాగా, గతంలోనూ.. ఎన్కపల్లిలో ఇద్దరు రైతులకు చెందిన మేకలు మాయమైనట్లు చెబుతున్నారు. ఒక్క ఎన్కపల్లిలోనే కాకుండా రాపల్లికోట, బెగ్లూర్ గ్రామాల్లోనూ మేకలు, గొర్రెలు మాయమైనట్లు చెబుతున్నారు. అవి కూడా ఈ దొంగల పనే అయి ఉంటుందని అనుమానిస్తున్నారు. ఈ విషయమై ఎస్సై పవన్‌కుమార్‌ను అడుగగా గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి విఫలయత్నం చేశారని అన్నారు.

ఉత్సాహంగా ఫుట్‌బాల్ క్రీడలు



గెలుపొందిన వరంగల్, నల్గొండ జట్లతో నిర్వాహకులు

జనగామ కల్చరల్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ క్రీడలు ఉత్సాహంగా జరిగాయి. శుక్రవారం జనగామ జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో అండర్-19 విభాగంలో వరంగల్, కరీంనగర్ జట్ల మధ్య పోటీలు జరగ్గా వరంగల్ జట్టు విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరగా నల్గొండ, రంగారెడ్డి జిల్లాల మధ్య జరిగిన పోటీల్లో నల్గొండ జట్టు విజయం సాధించి ఫైనల్‌కు చేరినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, భోగ కైలాసం, లింగ్యానాయక్, ఎస్‌ఏ రజా, కిషన్, గోర్‌సింగ్, వేణు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



చెరువులో లభించిన మృతదేహం

రఘునాథపల్లి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కనిపించిన ఘటన జనగామ జిల్లా రఘునాథపల్లి మండలంలోని గోవర్ధనగిరి మర్రికుంటచెరువులో శుక్రవారం చోటు చేసుకుంది. 40 నుంచి 45 ఏళ్ల వయసున్న నలుపు రంగు చొక్కా, ప్యాంట్ ధరించి, చామన ఛాయ రంగు కలిగి ఉన్న వ్యక్తి చెరువులో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. వారు జిల్లా ఆస్పత్రి మార్చురికి మృతదేహాన్ని తరలించారు. సంబంధీకులు 87126 85211, 87126 85035 నెంబర్లకు సంప్రదించాలని ఎస్ఐ డి.నరేష్ కోరారు.

ఆర్టీసీలో కొలువుల మేళా

- ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ
- రీజియన్ పరిధిలో భర్తీ కానున్న 130 డ్రైవర్, 66 మెకానికల్, 10 ఇతర పోస్టులు
- సుదీర్ఘ కాలం తర్వాత కొత్త ఉద్యోగాల భర్తీ
- అక్టోబరు 8 నుంచి దరఖాస్తుల స్వీకరణ

హనుమకొండ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో 13 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఉద్యోగ నియమకాలు జరుగబోతున్నాయి. వేయి మంది డ్రైవర్లు, 743 మంది శ్రామిక్ పోస్టుల భర్తీకి తెలంగాణ పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు బుధవారం నోటిఫికేషన్ జారీ చేసింది. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్‌ఆర్టీసీ) వరంగల్ రీజియన్ పరిధిలో డ్రైవర్లు, మెకానిక్ (శ్రామిక్) పోస్టులు త్వరలో భర్తీ కానున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 1,100 డ్రైవర్ పోస్టులు, 743 శ్రామిక్ పోస్టులను భర్తీ చేయాలని ఆర్టీసీ యాజమాన్యం నిర్ణయించింది. ఇందులో భాగంగా వరంగల్ రీజియన్ పరిధిలోని 9 డిపోల్లో మొత్తం 196 పోస్టులు ఉండగా, 130 డ్రైవర్ పోస్టులు, 66 మెకానిక్ పోస్టులు ఖాళీ ఉన్నట్టు నోటిఫికేషన్‌లో చూపారు. నియామక ప్రక్రియ బాధ్యతను ఆర్టీసీకి కాకుండా పోలీసు నియామక మండలికి అప్పగించారు. దీంతో నోటిఫికేషన్ పోలీసు నియామక మండలి ద్వారానే జారీ అయింది.

డ్రైవర్ పోస్టులు

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మొత్తం 5 డ్రైవర్ పోస్టుల్లో 1 ఎల్‌ఆర్ కింద, 4 డీఆర్ కింద భర్తీ చేస్తారు. ములుగు జిల్లాలో మొత్తం 3 పోస్టులను డీఆర్ కింద ఎంపిక చేస్తారు. వరంగల్ జిల్లాలో మొత్తం 29 ఖాళీల్లో 2 ఎల్‌ఆర్ కింద, 27 డీఆర్ కింద, హనుమకొండ జిల్లాలో మొత్తం 41 పోస్టుల్లో 4 ఎల్‌ఆర్ కింద, 37 డీఆర్ కింద, మహబూబాబాద్ జిల్లాలో మొత్తం 31 పోస్టుల్లో 3 ఎల్‌ఆర్ కింద, 28 డీఆర్ కింద జనగామ జిల్లాలో మొత్తం 21 పోస్టుల్లో 2 ఎల్‌ఆర్ కింద, 19 డీఆర్ కింద నింపుతారు. ఎల్‌ఆర్ పోస్టులలో స్థానికులనే ఎంపిక చేస్తారు.

శ్రామిక్ పోస్టులు

వరంగల్ రీజియన్‌లోని మొత్తం 66 శ్రామిక్ ఖాళీల్లో భూపాలపల్లి జిల్లా పరిధిలో 3, ములుగు జిల్లాలో 2, వరంగల్ జిల్లాలో 15, హనుమకొండ జిల్లాలో 21, మానుకోట జిల్లాలో 15, జనగామ జిల్లాలో 10 పోస్టులను ప్రత్యక్షంగా నియామకం చేస్తారు.

ఆరు జిల్లాల్లో పోస్టులు

ఆర్టీసీ వరంగల్ రీజియన్ పరిధిలోని ఆరు జిల్లాల్లో మొత్తం 130 డ్రైవర్ పోస్టులను భర్తీ చేయనున్నారు. వీటిలో ఎల్‌ఆర్ (లిమిటెడ్ రిక్రూట్ మెంట్-బ్యాక్‌లాగ్) కేటగిరీ కింద 13 పోస్టులను భర్తీ చేయగా మిగతా 117 పోస్టులను డీఆర్ (డైరెక్టు రిక్రూట్‌మెంట్) కింద నింపుతారు. అలాగే శ్రామిక్ (మెకానిక్ డీజిల్, మెకానిక్ (మోటార్ వెహికిల్) పోస్టులు 66 భర్తీ చేయనున్నారు. వీటితో పాటు షీట్‌మెటల్, ఆటో ఎలక్ట్రిషియన్ తదితర మరో 10 ఇతర పోస్టులను కూడా నింపుతారు. వీటన్నిటిని ప్రత్యక్ష నియామకం ద్వారానే ఎంపిక చేస్తారు.



10 ఇతర పోస్టులు

ఇవికాకుండా వరంగల్ రీజియన్ పరిధిలో పది ఇతర పోస్టులను కూడా భర్తీ చేస్తారు. షీట్‌మెటల్-ఎంవిబీబీ/ఆర్‌హెచ్‌జీకి సంబంధించి మొత్తం 4 పోస్టుల్లో వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, జనగామ జిల్లాల్లో ఒక్కోక్కటి చొప్పున, అలాగే వరంగల్ జిల్లాలో 1 శ్రామిక్ పేయింటిగ్ పోస్టును, హనుమకొండ జిల్లాలో శ్రామిక్ వెల్డింగ్ పోస్టును, జయశంకర్ భూపాలపల్లి, హనుమకొండ జిల్లాలో ఒక్కొక్కటి చొప్పున కట్టింగ్, పీవింగ్ అప్‌హోల్‌స్టర్ పోస్టులను, ములుగు, మహబూబాబాద్ జిల్లాలో ఒక్కోక్కటి చొప్పున మిల్‌రైట్ మెకానిక్ పోస్టులను కూడా ఇదే నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేస్తారు.

నియామకాలు ఇలా..

డ్రైవర్ పోస్టులకు పదో తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలి. నోటిఫికేషన్ వెలువడిన తేదీ నాటికి 18 నెలలకు తక్కువ కాకుండా హెవీ ప్యాజింజర్ మోటార్ వెహికిల్/ హెవీ గూడ్స్ వెహికిల్, ట్రాన్స్‌పోర్టు వెహికిల్ డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలి. 1 నుంచి 7వ తరగతుల వరకు స్టడీ సర్టిఫికెట్లు, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు, ఈడబ్ల్యుఎస్ సర్టిఫికెట్, బీసీ అయితే నాన్ క్రిమిలేయర్ పత్రాలు దరఖాస్తుతో పాటు జతపరచాలి. డ్రైవర్ పోస్టులకు పోటీ పడే అభ్యర్థుల ఎత్తు 160 సెంటీమీటర్ల కన్నా తక్కువ ఉండరాదు. మొత్తం 100 మార్కుల్లో డ్రైవింగ్ పరీక్షకు 60, వెయిటేజీ కింద 40 మార్కులను కేటాయిస్తారు. ఏడు ప్యారా మీటర్లలో డ్రైవింగ్ పరీక్ష ఉంటుంది. దీనికి 60 మార్కులు కేటాయించారు. కనీసం 30 మార్కులు సాధించాలి. మూడు, అంతకన్నా ఎక్కువ ప్యారామీటర్లలో కనీస మార్కులు సాధించాలి. లేదంటే ఫెయిల్ అయినట్లే. అభ్యర్థి పదో తరగతి సాధించిన మార్కులు, డ్రైవింగ్ లైసెన్సు రకం, సీనియారిటీని అనుసరించి మార్కులు వేస్తారు. మొత్తం 100 మార్కులకు అర్హత సాధించాలంటే ఓసీ, ఈడబ్ల్యుఎస్ వర్గాలు 50, బీసీలు 45, ఎస్సీలు, ఎస్టీలు 40 శాతం మార్కులు సాధించాలి.

ప్రతిభ ఆధారంగా..

మెకానిక్ (శ్రామిక్) పోస్టులకు సంబంధించి అభ్యర్థి ప్రతిభ ఆధారంగా నియామక ప్రక్రియ ఉంటుంది. ఐటీఐలోచూపిన ప్రతిభ ఆధారంగా 90 మార్కులు, నేషనల్ అప్రెంటిస్‌షిప్, ధ్రువీకరణ పత్రాలకు 10 మార్కులు కేటాయిస్తారు. మొత్తం 100 మార్కుల్లో ఓసీ, ఈడబ్ల్యుఎస్ వర్గాల వారికి 50, బీసీలకు 45, ఎస్సీ, ఎస్టీలకు 40 శాతం మార్కులు రావాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యుఎస్ వర్గాల వారికి, మాజీ సైనికులకు మూడేళ్ల వయోపరిమితి సడలింపు ఉంటుంది. దరఖాస్తులను అక్టోబర్ 8 నుంచి 28వ తేదీ వరకు .tgprb.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు దాఖలు చేయాలి.

13 ఏళ్ల తర్వాత..

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత ఆర్టీసీలో జరగబోతున్న తొలి నియామక ప్రక్రియ ఇదే. చివరిసారిగా 2012లో డ్రైవర్లు, కండక్టర్లను నియమించారు. ఆ తర్వాత మళ్లీ నియమకాలు జరగలేదు. ఉద్యోగ విరమణలతో భారీగా ఖాళీలు ఏర్పడినప్పటికీ ఉన్న సిబ్బందితోనే ఆర్టీసీ నెట్టుకొస్తోంది. సమీప భవిష్యత్తులో ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, శ్రామిక్‌లు ఉద్యోగ విరమణ పొందుతున్నారు. దీంతో డబుల్ డ్యూటీలు పెరిగి ఇప్పటికే తీవ్రఇబ్బందులకు గురవుతున్నారు. ఇక మరింత భారం మోపితే పరిస్థితి అదుపు తప్పుతుందని డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఖాళీల భర్తీకి ఆర్టీసీ ప్రభుత్వానికి ప్రతిపాదించింది.

అర్హతలు - ప్రక్రియ

డ్రైవర్ వేతనం రూ.20,960-60,080 మధ్య ఉంటుంది. వయసు 22 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి. దరఖాస్తు రుసుము ఎస్సీ, ఎస్టీలకు రూ.300, ఇతరులకు రూ.600 కాగా, శ్రామిక్ వేతనం రూ.16,550-45,030. వయసు 18 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి. దరఖాస్తు రుసుము ఎస్సీ, ఎస్టీలకు రూ. 200, ఇతరులకు రూ.400.

గ్రూప్-1లో తోట సోని ప్రతిభ

ఏటీవో ఉద్యోగానికి ఎంపిక



హనుమకొండ చౌరస్తా, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదల చేసిన గ్రూప్-1 తుది ఫలితాల్లో హనుమకొండ టైలర్స్ స్ట్రీట్‌లోని పేద కుటుంబానికి చెందిన తోట జ్యోతి-దామోదర్ పెద్ద కుమార్తె సోని 203వ ర్యాంకు సాధించి అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్ (ఏటీవో) కొలువును సాధించారు. కాగా, సోని ఇప్పటికే గ్రూప్-4లో ఎంపికై శాయంపేట మండల కేంద్రంలోని ఎంజేపీ జూనియర్ కళాశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. దీంతో సోనీ తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు ఆనందంతో సంబరాలు జరుపుకున్నారు. ఈ మేరకు ఏటీవోగా ఎంపికైన తోట సోని శనివారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఉద్యోగ నియామకపత్రాన్ని అందుకోనున్నారు.

సీటీవో ఉద్యోగానికి కొడారి గీత ఎంపిక



జఫర్‌గడ్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ విడుదల చేసిన గ్రూప్ -1 ఫలితాల్లో జనగామ జిల్లా జఫర్‌గడ్ మండలం ఉప్పుగల్లుకు చెందిన కొడారి గీత కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్ (సీటీఓ)గా ఎంపికైంది. పట్టుదలతో చదివి గ్రూప్-1లో ప్రతిభను చాటి 121వ ర్యాంకును సాధించింది. వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్న రైతు కొడారి కనకయ్య-రజిత దంపతుల కుమార్తె అయిన గీత టెన్త్ స్టేషన్‌ఘన్‌పూర్‌లో, ఇంటర్, డిగ్రీ వరంగల్, హైదరాబాద్‌లో చదివింది. 2024-25లో ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో పీజీ పూర్తి చేసింది. యూనివర్సిటీలో ఉంటూ పట్టుదలతో కష్టపడి చదివి పరీక్ష రాసిన గీత తొలి ప్రయత్నంలోనే గ్రూప్-1లో మంచి ర్యాంకు సాధించి సీటీఓగా కొలువు సాధించడం విశేషం.

మునిసిపల్ కమిషనర్‌గా అక్షితారెడ్డి



లింగాలఘణపురం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): టీజీపీఎస్సీ గ్రూప్-1 ఫలితాల్లో జనగామ జిల్లా లింగాలఘణపురం మండలం నెల్లుట్ల గ్రామానికి చెందిన చిట్ల రాజేందర్‌రెడ్డి- ఇందిర దంపతుల కుమార్తె అక్షితారెడ్డి గ్రేడ్-1 మునిసిపల్ కమిషనర్‌గా సెలెక్ట్ అయ్యారు. అక్షితారెడ్డి 1-10 వరకు జనగామ ఏకశిల హైస్కూల్‌లో, ఇంటర్ విజ్ఞాన్ జూనియర్ కాలేజీ హైదరాబాద్‌లో, ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ ఫిజిక్స్ హైద్రాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో చేశారు. సివిల్స్ లక్ష్యంగా ఎక్సెల్ ఐఏఎస్ అకాడమీలో సెంటర్ హెడ్‌గా పనిచేస్తున్న అక్షితారెడ్డి తాజాగా వెలువడిన గ్రూప్-1 ఫలితాల్లో తన సత్తా చాటుకున్నారు.

డీఎస్పీగా ఎంపికైన ఆదిశేషురెడ్డి



అలాగే ఇదే గ్రామానికి చెందిన చిట్ల దేవేందర్‌రెడ్డి- అంజనీదేవి దంపతుల కుమారుడు ఆదిశేషురెడ్డి గ్రూప్-1 ఫలితాల్లో మల్టీజోన్-2లో 91 ర్యాంకును సాధించి డీఎస్పీగా ఎంపికయ్యారు. ఆదిశేషురెడ్డి 1నుంచి6 వరకు జనగామలోని సెయింట్‌మేరీస్‌లో, 7నుంచి10 వరకు హైద్రాబాద్‌లోని బ్రిలియంట్ హైస్కూల్‌లో, ట్రిపుల్‌ఐటీ బాసరలో కెమికల్ ఇంజనీరింగ్ పూర్తి చేశారు. కాగా సెంట్రల్, స్టేట్ ఎగ్జామ్‌లను రాసిన ఆదిశేషురెడ్డి రైల్వేలో ఉద్యోగం సాధించారు. ఆ తర్వాత వెలువడిన గ్రూప్-2 పరీక్షల్లో తన ప్రతిభను చాటి ఎక్సైజ్ ఎస్సైగా కొలువును సాధించి ప్రస్తుతం వికారాబాద్ జిల్లా తాండూర్‌లో పనిచేస్తున్నారు. తాజాగా వెలువడిన గ్రూప్-1 ఫలితాల్లో మల్టీజోన్ పరిధిలో 91వ ర్యాంకును సాధించి డీఎస్పీ ఉద్యోగానికి ఎంపికయ్యారు.

గ్రూపు-1లో సత్తా చాటిన కల్యాణ్

ఎంపీడీవోగా ఎంపిక - జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ గ్రూపు 1,2,3లో అర్హత



బయ్యారం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ కొలువు సాధించడమంటే ఓ యజ్ఞమే. ఎన్నో ఏళ్లు కష్టపడాల్సి వస్తది. అలాంటిది ఓ యువకుడు ఏకంగా గ్రూపు 1,2,3,4 ఫార్మెట్లలో అన్ని పరీక్షలు రాసి, ర్యాంకులు సాధించాడు. తాజాగా వెల్లడైన గ్రూప్-1 ఫలితాల్లో ఎంపీడీవో ఉద్యోగ అర్హత సాధించి, పలువురు ప్రశంసలు పొందాడు నూతనపాటి కల్యాణ్. ఈ అరుదైన ఘట్టానికి మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం గంధంపల్లి గ్రామం వేదికగా నిలిచింది.

గంధంపల్లి గ్రామానికి చెందిన నూతనపాటి శ్రీనివాస్‌రావు-సునీత దంపతులది వ్యవసాయ కుటుంబం. వీరికి ఒక్క కుమారుడు కల్యాణ్ సంతానం. శ్రీనివాస్‌రావు చాలాకాలం క్రితం గుండె సంబంధిత వ్యాధితో చనిపోగా, సునీత ఐకేపీలో వీవోఏగా పనిచేస్తూ కుమారుడిని చదివిస్తూ వచ్చింది. పదో తరగతి వరకు మానుకోటలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో కల్యాణ్ విద్యనభ్యసించాడు. ఇంటర్ విద్య హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కళాశాల్లో పూర్తి చేశాడు. 2019లో నోబుల్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసిన కల్యాణ్ అనంతరం హైదరాబాద్‌లో ఉంటూ 4 ఏళ్లుగా గ్రూప్స్, సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్నాడు. ఈ క్రమంలోనే తొలిసారి 2023లో గ్రూప్స్ రాసిన కల్యాణ్ గ్రూపు-4లో ఉత్తీర్ణత సాధించి, మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో రెవెన్యూ శాఖలో ల్యాండ్ లిటిగేషన్ విభాగంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మరోపక్క గ్రూప్స్, సివిల్స్‌కు కూడా ప్రిపేర్ అవుతూవచ్చాడు.

ఈ క్రమంలోనే 2024లో టీజీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్స్ 1,2,3 పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించాడు.ఆరు మాసాల క్రితం వచ్చిన గ్రూప్-2 ఫలితాల్లో 194వ ర్యాంకు సాధించి అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ (ఏఎస్‌వో)గా ఉద్యోగ అర్హత పొందాడు. గ్రూప్-3లో సైతం 384వ ర్యాంక్ సాధించి సీనియర్ ఆడిటర్ (ఎస్‌ఏ)గా ఉద్యోగ అర్హత సాధించాడు. తాజాగా వెలువడిన గ్రూప్-1 ఫలితాల్లో 605 ర్యాంక్ సాధించి ఎంపీడీవోగా ఉద్యోగ అర్హత పొందాడు.

డిప్యూటీ కలెక్టర్‌గా బంధనపల్లి యువకుడు



ఇల్లందుల రాకేష్

రాయపర్తి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బంధనపల్లి గ్రామానికి చెందిన ఇల్లందుల రాకేష్ గ్రూప్ -1 ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించి డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికయ్యాడు. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన ఇల్లందుల నర్సయ్య భాగ్యమ్మ దంపతుల కుమారుడు రాకేష్ పదో తరగతి వరకు స్థానిక కొత్తూరు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదివాడు. అనంతరం డీఆర్డీఏ ద్వారా హన్మకొండలోని ఎస్సార్ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేశాడు. ఉస్మానియా యూనివర్సిటీలో బీటెక్ పూర్తి చేసి గ్రూప్ 4, గ్రూప్ 3 లో సైతం విజయం సాధించాడు. మళ్లీ గ్రూప్ 1 కోసం సాధన చేసి ఫలితాల్లో 491 మార్కులుతో 78వ ర్యాంకు సాధించాడు. నేడు(శనివారం) డిప్యూటీ కలెక్టర్‌గా నియామకపత్రం అందుకోనున్నట్లు తెలిపాడు. ఐఏఎస్ కావడమే తన లక్ష్యమని, దాని కోసం మరింత కృషి చేస్తానని స్పష్టం చేశాడు. గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చిన రాకేష్‌ను స్థానికులు, తల్లిదండ్రులు అభినందిస్తున్నారు.

మద్యం షాపుల దరఖాస్తుల్లో నిబంధనలు పాటించాలి

- ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

వరంగల్ క్రైం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వైన్‌షాపుల లైసెన్స్ నవంబర్ 30న ముగుస్తున్నందున (2025-27) రెండేళ్ల కాలవ్యవధికి నూతన మద్యం పాలసీ అమలులో భాగంగా దరఖాస్తులు స్వీకరించేందుకు సర్వం సిద్ధం చేసినట్లు హనుమకొండ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం ఎక్సైజ్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వరంగల్ అర్బన్ జిల్లాలోని 4 ఎక్సైజ్‌స్టేషన్ల పరిధిలో ఉన్న 67 షాపులకు టెండర్లను ఆహ్వానిస్తున్నామన్నారు. టెండర్ల వేయాలనుకునే ఆసక్తిగల దరఖాస్తుదారుడు రూ.3 లక్షల (నాన్ రిఫండబుల్)ను వరంగల్ అర్బన్ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి పేరిట డీడీ ద్వారానైనా లేదా ప్రభుత్వ చలాన్ ద్వారానైనా చెల్లించవచ్చన్నారు. రిజర్వేషన్ వ్యక్తులు తప్పనిసరిగా కుల ధ్రువీకరణ పత్రాన్ని దరఖాస్తుతో జతపరిచి ఇవ్వాలన్నారు. 3 పాస్ ఫోటోలు, ఆధార్, పాన్ కార్డులను ఇవ్వాలన్నారు.

హనుమకొండ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 27 వైన్స్ షాపులు ఉండగా, ఎస్టీ-1, ఎస్సీ-5, గౌడ్-4, కాజీపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 15 వైన్స్‌షాపులు ఉండగా ఎస్సీ-3, గౌడ్-6, వరంగల్ అర్బన్ పరిధిలో 12 వైన్స్ ఉండగా, ఎస్సీ-1 గౌడ్-1, ఖిలా వరంగల్ పరిధిలో 13 వైన్స్‌షాపులు ఉండగా ఎస్సీ-1, గౌడ్-4 షాపులను రిజర్వేషన్‌ల్లో భాగంగా ఆయా సామాజిక వర్గాలకు కేటాయించినట్లు తెలిపారు. హనుమకొండ కలెక్టరేట్ సెల్లార్‌లో అక్టోబర్ 18 వరకు సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. ఆపై వచ్చే నెల 23న అంబేద్కర్‌భవన్‌లో లాటరీ పద్ధతిన జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో లబ్ధిదారుల వివరాలను వెల్లడించనున్నట్లు తెలిపారు. నోటిఫికేషన్‌కు సంబంధించి ఎలాంటి సందేహాలున్నా.. దరఖాస్తుల స్వీకరణ ప్రాంతంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్‌ను సందర్శించి నివృత్తి చేసుకోవచ్చన్నారు. దరఖాస్తులను కలెక్టరేట్‌తో పాటు హైదరాబాద్ నాంపల్లిలోని అబ్కారీ భవన్, దర్గా రోడ్డులోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో అందజేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కాజీపేట ఎక్సైజ్ సీఐ చంద్రమోహన్, హనుమకొండ ఎక్సైజ్ సీఐ దర్గాభవాని, వరంగల్ అర్బన్ ఎక్సైజ్ సీఐ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

వరంగల్ రూరల్‌లో 57 షాపులకు టెండర్లు

వరంగల్ క్రైం (ఆంధ్రజ్యోతి): వరంగల్ రూరల్ వరంగల్ రూరల్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 57 వైన్‌షాపులకు టెండర్లు నిర్వహిస్తున్నట్లు వరంగల్ రూరల్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ డి.అరుణ్‌కుమార్ తెలిపారు. ఇందులో 22 మద్యం షాపులను ఎస్సీ, ఎస్టీ, గౌడ్‌లకు కేటాయించినట్లు వెల్లడించారు. నర్సంపేట పరిధిలో ఉన్న 22 షాపుల్లో గౌడ్-4, ఎస్సీ-4, ఎస్టీ-1, పరకాల పరిధిలోని 20 షాపుల్లో గౌడ్- 6, ఎస్సీ-2, ఎస్టీ-1, వర్ధన్నపేట పరిధిలోని 15 షాపుల్లో గౌడ్స్-4 షాపులు కేటాయించినట్లు తెలిపారు. దరఖాస్తులను హనుమకొండ ప్రగతినగర్‌లోని ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే అక్టోబర్ 23న వరంగల్ ఉర్సు రోడ్డులోని నాని గార్డెన్‌లో లాటరీ పద్ధతిలో కలెక్టర్ సమక్షంలో అబ్ధిదారుల వివరాలను ప్రకటిస్తామన్నారు. దరఖాస్తులు (నాన్ రిఫండబుల్) ఫీజు రూ.3లక్షలను ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ వరంగల్ రూరల్ పేరిట డీడీ తీసి దరఖాస్తుకు జతపరచాలన్నారు. మిగతా వివరాల కోసం దరఖాస్తుల స్వీకరణ కేంద్రంలోని ప్రత్యేక కౌంటర్‌లో సంప్రదించాలని డి.అరుణ్‌కుమార్ పేర్కొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న ఎన్నికైన సంఘం నూతన కమిటీ సభ్యులు

ఆదివాసీ తెగలకు అండగా ఏటీటీఎస్ఎస్

- ఏటీటీఎస్ఎస్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం కమలామనోహర్

గీసుగొండ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అటవీ ప్రాంతాలలో ఉంటున్న ఆదివాసీ 9 రకాల తెగలకు ఆదివాసీ తోటి తెగ సేవా సంఘం(ఏటీటీఎస్ఎస్) అండగా ఉంటుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం కమలామనోహర్ అన్నారు. శుక్రవారం జాన్‌పాకలో ఏర్పాటు చేసిన ఆదివాసీ తెగల ఐక్యవేదిక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చెంచు, కొలం, తోటి, కొండారెడ్డి తెగలు ఇప్పటికీ విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో పూర్తిగా వెనుకబడి ఉన్నారని తెలిపారు. ఆదివాసి తోటి తెగల కోసం ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి వారిని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఎస్టీ రిజర్వేషన్‌లో అధిక సంఖ్యాకులైన వలసదారులు లంబాడీలు విద్యా, ఉద్యోగ, రాజకీయ లబ్ధిపొందుతూ ఆదివాసీలకు దక్కకుండా చేస్తున్నారని మండిపడ్డారు. లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలనే ఏకైక డిమాండ్‌తో సుప్రీంకోర్టులో పోరాడుతామని ఆయన స్పష్టం చేశారు.

రాష్ట్ర నూతన కమిటీ ఎన్నిక

ఆదివాసీ తోటి సంఘం రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘం గౌరవ అధ్యక్షుడిగా షెడ్మాకి సంజీవ్, అధ్యక్షుడిగా ఆత్రం కమలామనోహర్, ప్రధాన కార్యదర్శిగా గుర్రం రఘు, ఉపాధ్యక్షుడిగా ఆత్రం జగన్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కుర్సంగ వేణు, కోశాధికారిగా షెడ్మాకి భిక్షపతి, కార్యదర్శిగా సోయం రమేష్, సహాయ కార్యదర్శులుగా గుర్రాల సమ్మయ్య, సోయం శరత్‌బాబు, సలహాదారులుగా సోయం వెంకటస్వామి, సోయం సాంబయ్య, మడావి రాంచందర్, ప్రచార కార్యదర్శులుగా కుమ్రం సాయి, షెడ్మాకి వీరయ్య, సాంస్కృతిక కారదర్శులుగా ఆత్రం రవిందర్, ఆత్రం పురుషోత్తం, రాష్ట్ర యువ సంఘం కన్వీనర్‌గా షెడ్మాకీ సారయ్యను ఎనుకున్నారు.

వైభవంగా అమ్మవారి శోభాయాత్ర

పైడిపెల్లిలో ఆధ్యాత్మిక సందడి

పోచమ్మమైదాన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 3వ డివిజన్ పైడిపెల్లిలో భద్రకాళి యూత్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం వైభవంగా అమ్మవారి శోభాయాత్ర నిర్వహించారు. అమ్మవారిని పెద్ద ఎత్తున అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పలు రకాల అమ్మవారి విగ్రహాలు ఏర్పాటు చేసి శోభాయాత్ర నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ జన్ను షీబారాణి, కాంగ్రెస్ నాయకుడు జన్ను అనిల్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై యాత్రను ప్రారంభించారు. యాత్రలో ఏర్పాటు చేసిన అమ్మవారు, కాళికామాత రూపంలో ఉన్న విగ్రహాలు ఎంతో ఆకట్టుకున్నాయి. డప్పు చప్పుళ్లు, భజనల మధ్య వైభవంగా, జాతరను తలపించేలా ఊరేగింపు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి వచ్చిన కళాకారులు వివిధ రూపాలలో అమ్మవారి అలంకరణలో వైవిధ్యమైన ప్రదర్శనలు చేశారు. నిప్పుతో, డప్పు చప్పుళ్ల మధ్య నృత్యాలు చేస్తూ చూపరులను మంత్రముగ్ధుల్ని చేశారు. పెద్ద ఎత్తున బాణసంచా పేలుస్తూ జాతరను తలపించేలా రకరకాల విన్యాసాలతో అలరించారు. అనేక చోట్ల నుంచి ప్రజలు తరలి వచ్చి శోభాయాత్రను వీక్షించారు. కార్యక్రమంలో ఇట్యాల హరికృష్ణ, ఎల్లావుల లలితాయాదవ్, ఎల్లావుల కుమార్‌యాదవ్, పోతురాజు రాజు, విద్యాసాగర్‌రావు, రతన్, జన్ను రాజయ్య, లింగం మూర్తి, ఆకుల సంపత్, ఆకుల శ్రీనివాస్, ఆకుల సతీష్, ఏనుమాముల సీఐ సురేష్, ఎస్సై రాజు తదితరులు పాల్గొన్నారు.



శోభాయాత్రలో కాళికామాత విగ్రహం



శోభాయాత్రను ప్రారంభిస్తున్న ప్రముఖులు

వెల్లి విరియని పర్యాటకళ

5వ పేజీ తరువాయి

ఫలితంగా ఉమ్మడి వరంగల్ జిల్లా హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలుగా ఏర్పడ్డాయి. వీటిలో హనుమకొండ జిల్లాలో మినహా మిగతా జిల్లాలో ఇప్పటి వరకు టూరిజం ఆఫీసులు లేవు. ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రంగా ఉన్న పూర్వ పర్యాటక కార్యాలయం హనుమకొండ కలెక్టరేట్‌లో కొనసాగుతోంది. కొత్త జిల్లాల పరిధిలో పలు పర్యాటక ప్రాంతాలు అనేకం ఉన్నా అక్కడ టూరిజం ఆఫీసులు లేకపోవడంతో పర్యవేక్షణ, పర్యాటక ప్రాంతాలపై ప్రచారం కరువైంది. ఈ జిల్లాల్లో పర్యాటకాభివృద్ధి కుంటుపడుతోంది.

9 జిల్లాలకు ఒకే అధికారి

బీఆర్‌ఎస్ హయాంలో పర్యాటకం తీవ్ర నిర్లక్ష్యానికి గురైంది. అంతకు ముందు కాంగ్రెస్ హయాంలో ఎంతో కొంత అభివృద్ధి జరిగింది. జిల్లాలకు నిధులు కూడా విడుదలయ్యేవి. కానీ ఆ తర్వాత బీఆర్‌ఎస్ సర్కార్ పర్యాటకాన్ని ఏ మాత్రం పట్టించుకోలేదు. రాష్ట్రంలో ఇప్పటికీ మూడు జిల్లాలు హైదరాబాద్, హనుమకొండ, నల్లగొండ జిల్లాల్లో మాత్రమే పర్యాటక కార్యాలయాలు ఉన్నాయి. వీటికి ముగ్గురు అధికారులు ఉండగా, ఒక్కో అధికారి పరిధిలో 9 నుంచి 10 జిల్లాలు ఉన్నాయి. హనుమకొండ కలెక్టరేట్ కేంద్రంగా ఉన్న పర్యాటక కార్యాలయ అధికారి శివాజీ.. వరంగల్ ఉమ్మడి జిల్లాతో పాటు నల్లగొండ ఉమ్మడి జిల్లా బాధ్యతలను కూడా చూస్తున్నారు. 13 ఏళ్లుగా ఉమ్మడి వరంగల్, నల్లగొండ జిల్లాల పరిధిలోని 9 జిల్లాల్లోని పర్యాటక ప్రాంతాల పర్యవేక్షణను ఆయనే చూస్తున్నారు.

సిబ్బంది కొరత

పర్యాటక శాఖకు చాలినంత సిబ్బంది లేరు. ప్రస్తుతం ఉన్నవారిలో చాలా మంది కాంట్రాక్టు ఉద్యోగులే. జిల్లా పర్యాటక శాఖ కార్యాలయంలో ఉన్న ఏడుగురు ఉద్యోగుల్లో జిల్లా అధికారి, ముగ్గురు అటెండర్లు మినహా మిగతా వారు చాలా ఏళ్లుగా కాంట్రాక్టు పద్ధతిపై పని చేస్తున్నారు. ఈ అటెండర్లు కూడా కారుణ్యనియామకాల కింద నియమితులైనవారే. ఉమ్మడి జిల్లా పరిధిలో అనేక ముఖ్యమైన పర్యాటక ప్రాంతాలు ఉన్నప్పటికీ వాటి గురించి టూరిస్టులకు వివరించడానికి, వాటి గొప్పతనం, విశిష్టతలను విదేశీ పర్యాటకలు, ఇతర రాష్ట్రాల సందర్శకులకు తెలియచేయడానికి చాలినంత మంది గైడ్లు లేరు. పాండవులగుట్ట, ఖిలా వరంగల్, రామప్ప గుడి వద్ద తప్ప మిగతా ప్రాంతాల్లో గైడ్లు లేరు. వారు కూడా కాంట్రాక్టు పద్ధతిపైనే పని చేస్తున్నారు.

అటకెక్కిన శిల్పారామం

నగర ప్రజలు ఏళ్లుగా ఎంతో ఆశతో ఎదురుచూస్తున్న శిల్పారామం ఏర్పాటు ప్రతిపాదన అటకెక్కింది. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు కావలసిన శిల్పారామం కలగానే మిగిలింది. హైదరాబాద్ తరహాలో వరంగల్‌కు 16 ఏళ్ల కిందటినాటి కాంగ్రెస్ ప్రభుత్వం శిల్పారామాన్ని మంజూరు చేసింది. ఇందుకోసం రూ.6.50కోట్ల మేర నిధులు కూడా కేటాయించింది. శిల్పారామం ఏర్పాటుకు అవసరమైన స్థలం ఎంపికపై తకరారు ఎడతెగకుండా కొనసాగుతూనే ఉంది. ప్రభుత్వ స్థలాలు అందుబాటులో ఉన్నా ఎంపికలో తీవ్ర జాప్యం జరుగుతోంది. రాష్ట్రంలో ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నందువల్ల గతంలో తమ హయాంలో మంజూరైన శిల్పారామాన్ని కనీసం ఇప్పుడైనా ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు. ఈ విషయంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రత్యేక చొరవ చూపాలని అభ్యర్థిస్తున్నారు. శిల్పారామం ఏర్పాటైతే పర్యాటకుల సంఖ్య పెరుగుతుంది. స్థానికంగా చేతి వృత్తుల వారికి పని దొరుకుతుంది.

మూడింటికీ ఒకే అధికారిని నియమించాలి

పర్యాటకం అంటే టూరిజం, కల్చర్, ఆర్కియాలజీతో కూడినటువంటిది. ప్రస్తుతం ఈ మూడు వేరే శాఖల పరిధిలో ఉండడం వల్ల సమన్వయం కొరవడుతోంది. ఫలితంగా పర్యాటకాభివృద్ధి కుంటుపడుతోంది. ఒక ప్రాంతంలోని పర్యాటక ప్రాంతాలు, ఆ ప్రాంత సంస్కృతి, అక్కడి పురావస్తు కట్టడాలు, వస్తువుల పర్యవేక్షణ ఒకే అధికారికి కిందికి తీసుకురావాలన్న అభిప్రాయాన్ని పర్యాటకులు వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు వీటి కోసం జిల్లాకు ఒక ప్రత్యేక అధికారిని నియమించాలని కోరుతున్నారు. దీని వల్ల ఆయా జిల్లాల్లో పర్యాటకం సమగ్రంగా అభివృద్ధి జరిగేందుకు అవకాశం ఏర్పడుతుంది.

ప్రపంచ పర్యాటక దినోత్సవం

ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం ఉదయం 10 గంటలకు హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయలో సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు బతుకమ్మ థీమ్ ప్రదర్శన నిర్వహించనున్నారు. పర్యాటక దినోత్సవంలో భాగంగా హనుమకొండ జిల్లా పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పర్యాటక రంగం మీద నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేస్తారు.

మ్యూజియం తరలింపు ఎప్పుడు ?

రాష్ట్ర పురావస్తుశాఖకు చెందిన మ్యూజియం తరలింపు నత్తనడకన సాగుతోంది. ప్రస్తుతం వరంగల్ నగర పాలక సంస్థ కార్యాలయం వెనుక ఉన్న మ్యూజియంను పర్యాటకుల సౌకర్యార్థం వరంగల్ కోటకు తరలించేందుకు 2015లో కోటకు దగ్గరలోనే భవనాన్ని నిర్మించారు. సుమారు రూ.5కోట్లతో భవనమైతే పూర్తయింది. కానీ అక్కడికి మ్యూజియంను మాత్రం తరలించలేదు. భవనంలో పురావస్తు వస్తువులను ప్రదర్శనకు పెట్టడానికి వీలుగా ప్లాట్‌ఫారాలను, షోకేసులను, ఇతరత్రా ఏర్పాట్లకు సంబంధించిన పనులు మిగిలిపోయాయి. మరో రూ.1 కోటి అవసరమవుతాయి. రాష్ట్ర ప్రభుత్వం ఈ నిధులను ఇవ్వకపోవడంతో మ్యూజియం పరిస్థితి ఎక్కడ వేసిన గొంగలి అక్కడే చందంగా మారింది. పదేళ్లుగా మ్యూజియం తరలింపు ముందుకు సాగడం లేదు. ఈ భవనం ప్రస్తుతం వరంగల్ కోట సెక్యూరిటీ సిబ్బందికి అవాసంగా ఉపయోగపడుతోంది. కార్పొరేషన్ కార్యాలయం వెనుక ప్రస్తుతం ఉన్న మ్యూజియంకు సరైన దారి లేదు. అసలు ఇక్కడ ఒక మ్యూజియం ఉన్న సంగతి చాలా మందికి తెలియదు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శని, ఆదివారాలు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ చేసిన హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ టీఎస్.దివాకర అన్నారు. శుక్రవారం ఆయన అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి దిశానిర్దేశం చేశారు. భారీ వర్షాల నేపథ్యంలో ఎలాంటి అత్యవసర పరిస్థితులు తలెత్తినా సమర్థవంతంగా ఎదుర్కొనేలా అన్ని విధాలుగా సన్నద్ధమై ఉండాలన్నారు. ఎక్కడా కూడా ప్రాణ, ఆస్తి నష్టం, మూగజీవాలు ప్రాణాలు కోల్పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ ప్రజలకు భరోసా కల్పించాలన్నారు. ప్రజలకు అత్యవసర పరిస్థితులు ఏర్పడితే కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూంకు సమాచారం అందించాలని సూచించారు. నదీ పరీవాహక ప్రజలను ముందస్తుగానే అప్రమత్తం చేయాలని, ఆయా శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ జిల్లాలో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చూడాలన్నారు. లోలెవల్ వంతెనలు, కాజ్‌వేల మీదుగా వరద ప్రవాహం ఉన్న సమయంలో రాకపోకలను నిషేధించాలని, చెరువులు, కాలువలు, నదుల్లో చేపల వేట, ఈత కోసం ఎవరూ వెళ్లవద్దని సూచించారు. ఎక్కడైనా రోడ్లు తెగినట్లయితే ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ట్రాఫిక్‌ను మళ్లించాలని, దారి మళ్లింపు చర్యల్లో పోలీస్ అధికారులు క్రియాశీలకంగా వ్యవహరించాలన్నారు. వర్షాల దృష్ట్యా కలెక్టరేట్‌లోని కంట్రోల్‌రూంలో 24గంటల పాటు అధికారులు, సిబ్బంది షిఫ్టుల వారీగా అందుబాటులో ఉంటారని కలెక్టర్ పేర్కొన్నారు.

నేడు ఏటీసీ ప్రారంభం

వాజేడు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐలో నూతనంగా నిర్మించిన అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్(ఏటీసీ)ను శనివారం ప్రారంభించనున్నారు. సుమారు రూ.44 కోట్లతో అధునాతన టెక్నాలజీ కోర్సులను విద్యార్థులు అభ్యసించే విధంగా నిర్మించిన భవనాన్ని మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ధనసరి సీతక్క, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్‌లు ప్రారంభించనున్నట్లు ప్రిన్సిపాల్ శేఖర్ తెలిపారు.

స్థానిక ఎన్నికలను సమర్థంగా నిర్వహించాలి

• జిల్లా అదనపు కలెక్టర్ సంపత్‌రావు

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలు పాటిస్తూ స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ సంపత్‌రావు డీపీవో దేవరాజులు అన్నారు. శుక్రవారం ములుగులోని జడ్పీహెచ్ఎస్ బాలురు, బాలికల పాఠశాలలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ సంపత్‌రావు మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారుల పాత్ర కీలకమైనదని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలన్నారు. అన్ని అంశాలపై అవగాహన పెంచుకుని అధికారులు, సిబ్బంది సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ఎన్నికల నిర్వహణలో ఏమైనా అనుమానాలు, ఇబ్బందులు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. పోలింగ్ కేంద్రాలవద్ద సరిపడా స్ట్రాంగ్‌రూంలు, బ్యాలెట్ బాక్సులు, తాగునీరు, మరుగుదొడ్లు, వీల్‌చైర్లు, తదితర సౌకర్యాలతోపాటు ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామగ్రి ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సందేహాలను నివృత్తి చేసుకుని ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేలా కృషి చేయాలన్నారు. శిక్షణలో మాస్టర్ ట్రైనర్లు సూర్యనారాయణ, మధుసూదన్, రాజేష్‌కుమార్, రవీందర్, శ్రీకాంత్, వెంకటేశ్వర్‌రెడ్డి, రమేష్, సతీష్, మహేందర్, మధు, అధికారులు పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సంపత్‌రావు

ఎన్నికల అధికారులకు శిక్షణ

మహదేవపూర్(ఆంధ్రజ్యోతి): సర్పంచ్, జడ్పీటీసీ,ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణ సన్నాహాల్లో భాగంగా శుక్రవారం ప్రిసైడింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లకు మండల కేంద్రంలోని రైతు వేదికలో శిక్షణ నిర్వహించారు. ఎన్నికల నిర్వహణ, విధులపై అవగాహన కల్పించినట్లు ఎంపీడీవో పేర్కొన్నారు.

పీవోలు, ఏపీవోలకు శిక్షణ

కాటారం(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండో విడత స్థానిక సంస్థల సాధారణ ఎన్నికల ప్రక్రియలో భాగంగా శుక్రవారం పీవో(ప్రిసైడింగ్ ఆఫీసర్), ఏపీవో(అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్)లకు శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో అడ్డూరి బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు, గ్రామ పంచాయతీల ఎన్నికల కోసం వేర్వేరుగా శిక్షణా తరగతులు నిర్వహించారు. మాస్టర్ ట్రైనర్ రాజేంద్రప్రసాద్ స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ నిర్వహణపై కూలంకషంగా అవగాహన కల్పించారు. పీవోలు, ఏపీవోలు ఎన్నికల నిర్వహణ సందర్భంగా చేయాల్సినవి, చేయకూడని అంశాలపై వివరించారు. ఈ శిక్షణా కార్యక్రమాల్లో తహసీల్దార్ నాగరాజు, ఎంపీవో వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

అవమానం భరించలేక దళిత రైతు ఆత్మహత్య

(5వ పేజీ తరువాయి)

ఫిర్యాదు చేశాడు. అయితే ఎస్సై పట్టించుకోకపోవడంతో మనస్తాపంతో ఈ నెల 16న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతిచెందాడు. భిక్షపతికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాదావత్ రాజు, ఉమ్మడి వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శి కర్ణాటకపు సమ్మయ్య, విద్యావంతుల వేదిక రాదండి దేవేందర్ సంఘటనపై విచారణ చేపట్టారు. ఎంజీఎంకు వెళ్లి కుటుంబీకులను వివరాలడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ నిరుపేద దళిత రైతును కులం పేరుతో దూషించడమే కాకుండా దాడి చేసిన బాబుపై కఠినచర్యలు తీసుకోవాలని, ఎస్సై అశోక్‌ను వెంటనే సస్పెండ్‌చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కలప పట్టివేత

మహదేవపూర్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో గోదావరి నది మీదుగా అక్రమంగా తరలిస్తున్న కలపను అటవీశాఖ అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. మహారాష్ట్ర నుంచి అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్లు అధికారులుపేర్కొన్నారు. కలప విలువ సుమారు రూ2లక్షల వరకు ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవో విజయ

వాజేడు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల ఎంపీడీవోగా విజయ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కన్నాయిగూడెం ఎంపీడీవోగా విధులు నిర్వర్తిస్తున్న ఆమెను ఎన్నికల బదిలీల్లో భాగంగా వాజేడుకు బదిలీ చేశారు. ఈ క్రమంలో శుక్రవారం ఆమె బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఉన్న శ్రీకాంత్ నాయుడు ఎంపీవోగా కొనసాగనున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రెగ్యులర్ ఎంపీడీవో ఉండాలనే నేపథ్యంలో ఆమెను తిరిగి వాజేడుకు బదిలీ చేశారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తా : ఎమ్మెల్యే

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తానని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన కమిటీ నాయకులు కలిసి పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులు ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా పని చేస్తారని అన్నారు. అలాగే సమాజంలో జరిగే వాస్తవాలను వెలికితీయాలని సూచించారు. ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి పనిచేస్తున్న జర్నలిస్టుల సమస్యలను తప్పకుండా పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎర్రం సతీష్‌కుమార్, జిల్లా కార్యదర్శి సారేశ్వర్‌రావు, కోశాధికారి రాంబాబు, జాయింట్ సెక్రటరీలు సుంకరి శ్రీధర్, దుర్గయ్య, జాతీయ కౌన్సిల్ సభ్యుడు కొలుగూరి సంజీవరావ పాల్గొన్నారు.

దేవరాంపల్లిలో కూలిన ఇల్లు

కాటారం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దేవరాంపల్లి గ్రామంలో భారీ వర్షానికి గురువారం రాత్రి నేరెళ్ల పోచమల్లు అనే వ్యక్తి పెంకుటిల్లు కుప్పకూలింది. పోచమల్లు ఇటీవల తన సోదరి ఇంటికి వెళ్లగా ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఇల్లు కోల్పోయిన తనను ఆదుకోవాలని బాధితుడు పోచమల్లు ప్రభుత్వాన్ని కోరారు. గత రెండు మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో లోతట్టు ప్రాంతాల్లోని పత్తి చేలల్లోకి వరదనీరు చేరి పంటలకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పట్టణంలో రక్తదాన శిబిరం

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఐటీ మాస్టర్స్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ సెంటర్ ఆధ్వర్యంలో శుక్రవారం మెగా రక్తదాన శిబిరం జరిగింది. పట్టణంలోని పలువురు యువకులు 103 యూనిట్ల రక్తాన్ని అందించారు. ఐటీ మాస్టర్స్ డైరెక్టర్ వేముల శంకర్ మాట్లాడుతూ తాము సేకరించిన రక్తాన్ని వరంగల్ ఎంజీఎంకు అప్పగించామని తెలిపారు. అలాగే 2011 నుంచి 2025 వరకు మొత్తంగా 5,500 యూనిట్ల రక్తాన్ని అందించినట్లు తెలిపారు. సంస్థ డైరెక్టర్ వేముల కుమార్, సురేందర్ పాల్గొన్నారు.

మిషన్ భగీరథ కార్మికుల ఆందోళన

• నాలుగు నెలల వేతనాల కోసం నిరాహార దీక్ష

ఏటూరునాగారం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ములుగు జిల్లా పరిధిలోని మిషన్ భగీరథ కార్మికులు శుక్రవారం దీక్ష చేపట్టారు. నాలుగు మండలాల నుంచి వచ్చిన కార్మికులు ఏటూరునాగారంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట ఈ దీక్షలో పాల్గొన్నారు. ధర్నాలు చేస్తే గానీ వేతనాలు పడని దుస్థితి తమకు ఎదురైందని, ఇది అత్యంత బాధాకరమని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. మిషన్ భగీరథలో పనిచేస్తున్న తమకు ప్రతి నెలా వేతనాలు సకాలంలో చెల్లించకపోవడంతో కుటుంబ పోషణ భారమై తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని దీక్షలో పాల్గొన్న కార్మికులు తెలిపారు. గత నాలుగు నెలల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని, ప్రతి కార్మికుడికి ప్రభుత్వ ఉన్నతాధికారి ద్వారా గుర్తింపు కార్డులు తక్షణమే ఇప్పించాలని కోరారు. ప్రతి కార్మికుడికి పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.



ఏటూరునాగారం జీపీ ఎదుట దీక్ష చేస్తున్న మిషన్ భగీరథ కార్మికులు

పాలంపేటలో కార్యాలయానికి తాళం

వెంకటాపూర్(ఆంధ్రజ్యోతి): వెంకటాపూర్ మండలంలోని పాలంపేట మిషన్ భగీరథ సిబ్బంది వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నీటి సరఫరా బంద్ చేసి మిషన్ భగీరథ కార్యాలయానికి తాళం వేశారు. గేటు ముందు బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నాలుగు నెలల నుంచి వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని, దసరా పండుగ జరుపుకునేందుకు ఆర్థిక స్థోమత లేదని అన్నారు. తక్షణమే తమకు వేతనాలు చెల్లించి ఆదుకోవాలని కోరారు. కార్మికులకు ప్రభుత్వం గుర్తింపు ఇచ్చేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కన్నాయిగూడెం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుట్టాయిగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ యూత్ నాయకుడు జనగాం దుర్గారావు తల్లి బక్కక్క ఇటీవల అనారోగ్యంతో మరణించింది. విషయం తెలుసుకున్న మండల పార్టీ ఇన్‌చార్జి జాడి రాంబాబు మంత్రి సీతక్క ఆదేశాలతో శుక్రవారం ఆమె దశదిన ఖర్మకుహాజరై కుటుంబాన్ని పరామర్శించారు.అలాగే రూ.6 వేల నగదును కుటుంబ సభ్యులకు అందచేశారు. కుటుంబానికి పార్టీ పరంగా అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరాములు, సురేందర్, వెంకట్, రమేష్, రాంమ్మూర్తి, రాజు, సందీప్, సంతోష్, కుమార్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



కుటుంబానికి ఆర్థిక సహాయం అందిస్తున్న కాంగ్రెస్ నేతలు

సత్తిరెడ్డి మృతి కాంగ్రెస్‌కు తీరనిలోటు

గోవిందరావుపేట, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పస్రా గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు యాస సత్తిరెడ్డి అనారోగ్యంతో మృతి చెందడం పార్టీకి తీరని లోటని ములుగు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, కిసాన్‌సెల్‌జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం వారు సత్తిరెడ్డి భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ మంచి నాయకుడిని కోల్పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. కుటుంబానికి పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ, నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఆదికర్మ యోగి అభియాన్‌తో ఆదివాసీ గ్రామాల అభివృద్ధి

• మోటా న్యూఢిల్లీ ఆదికర్మ యోగి జిల్లా ప్రభారి మనోజ్‌కుమార్ మీనా



బ్రాహ్మణపల్లిలో చైతన్య ర్యాలీలో పాల్గొన్న ఆదికర్మ యోగి సభ్యులు

మంగపేట, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): భగవాన్ బిర్సా ముండా 150వ జయంతిని పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆదికర్మ యోగి అభియాన్ ద్వారా ఆదివాసీ గ్రామాలు సుస్థిరంగా అభివృద్ధి చెందుతాయని న్యూఢిల్లీ మోటా మినిస్ట్రీ ఆఫ్ ట్రైబల్ అఫైర్స్ ములుగు జిల్లా ప్రభారి అధికారి మనోజ్‌కుమార్ మీనా అన్నారు. శుక్రవారం మండలంలోని ఆదివాసీ గ్రామాలైన దోమెడ, బ్రాహ్మణపల్లిలో అవేర్‌నెస్ కార్యక్రమాల్లో మనోజ్ మీనా హాజరై మాట్లాడారు. ప్రభుత్వానికి, ప్రజలకు సమన్వయం చేస్తూ అభివృద్ధి చేయడమే ముఖ్య లక్ష్యమన్నారు. అటవీ, వైద్యం, విద్య, పంచాయతీరాజ్, రెవెన్యూ, తదితర శాఖల అభివృద్ధి ప్రణాళికను మనమే నిర్ణయించుకునే విధంగా రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో ఈ కార్యక్రమం అమలు అవుతుందన్నారు. కార్యక్రమాలలో ఐటీడీఏ ఏపీవో(జనరల్) వసంతరావు, ఏవో రాజ్‌కుమార్, ఏసీఎంవో కొండా చెంచయ్య, రవీందర్, పెసా జిల్లా కో-ఆర్డినేటర్ కొమరం ప్రభాకర్, గిరిజన మేధావుల సంఘాల నాయకులు గొప్ప సమ్మారావు, కొమరం కన్నయ్య, రాందాస్, కొమరం లక్ష్మయ్య, సున్నం ఆనందం, పంచాయతీ కార్యదర్శులు కుర్సం హేమంత్, ఎట్టి రాంబాబు, అయ్యోరి యానయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. భూపాలపల్లి పట్టణంలోని బస్టాండ్ సమీపంలో గల చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద ఆ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జయంతి వేడుకలకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ముఖ్య అతిథిగా హాజరై ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి మాట్లాడారు. నిజాం, నవాబులపై వీరోచితంగా పోరాటం చేసిన చాకలి ఐలమ్మ ఆశయ సాధనకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ఈకార్యక్రమంలో చాకలి సంక్షేమ సంఘం నాయకులు పైడిపల్లి రమేష్, వెంకటేశ్వర్లు, రాజయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

• కాటారం(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో రజక సంఘం, బీఆర్ఎస్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలువురు నాయకులు ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొడ్డు స్మరణ్, రాజు, బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు రామిళ్ల కిరణ్, రజక సంఘం నాయకులు పెనుగొండ రాజయ్య, శ్రీనివాస్, సతీష్, సురేష్, మహేందర్, సురేష్, రజనీకాంత్, బీఆర్ఎస్ నేత కిరణ్, యూఎఫ్ఐ నేత అక్కల బాపు పాల్గొన్నారు.

• మల్హర్(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొయ్యూర్‌లో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో జాతీయ బీసీ సంఘం జిల్లా ఇన్‌చార్జి విజయగిరి సమ్మయ్య, రజక సంఘం మండల అధ్యక్షుడు పావురాల ఓదెలు, మాజీ సర్పంచ్ లింగమూర్తి, గడ్డం పోచయ్య, తాజొద్దీన్, శ్రీనివాస్‌రెడ్డి, దేవి భూమయ్య, గుంటి రమేష్ పాల్గొన్నారు.

• ఏటూరునాగారం(ఆంధ్రజ్యోతి): చాకలి ఐలమ్మ పోరాటమే తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తి అని బీఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహరావు(లక్ష్మణ్‌బాబు) అన్నారు. శుక్రవారం ఏటూరునాగారం మండల కేంద్రంలో చాకలి ఐలమ్మ 130వ జయంతి వేడుకలను రజక సంఘం, వై-జంక్షన్ వద్ద ఐలమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు దళపతి(చలపతి)ఆధ్వర్యంలోఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా లక్ష్మణ్ బాబు హాజరై ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షుడు పర్వతాల ఎల్లయ్య, ఉపాధ్యక్షుడు కుదురుపాక రాజేష్, కోశాధికారి పర్వతాల కుమారస్వామి, బీఆర్ఎస్ జిల్లా సీనియర్ నాయకులు కాకులమర్రి ప్రదీప్ బాబ, కాకులమర్రి భాస్కర్‌రావు, తమ్మ మల్లారెడ్డి, కూనూరు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

• కన్నాయిగూడెం(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో చాకలి ఐలమ్మ జయంతిని రజక కుల సంఘం మండల అధ్యక్షుడు పైడాకుల సమ్మయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎమ్డీ.అఫ్సర్ పాషా ముఖ్య అతిథిగా హాజరై ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. తెలంగాణ సాయుధ పోరాటంలో భూమి, భుక్తి, పేద ప్రజల విముక్తి కోసం నిజాం రజాకార్లను ఎదురించి పోరాడిన వీర వనిత ఐలమ్మ అని కొనియాడారు. కార్యక్రమంలో బీసీ జేఏసీ మండల అధ్యక్షుడు ముదురుకోళ్ల భిక్షపతి, రజక సంఘం నాయకులు శ్రీరాముల సందీప్, వేములవాడ రమేష్, ముక్కెర సాయి, శ్రీరాముల రవి, బొడ్డుపల్లి కిరణ్, శ్రీనివాస్, సాంబయ్య, నాగయ్య, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



కన్నాయిగూడెంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేస్తున్న నేతలు

• మంగపేట(ఆంధ్రజ్యోతి):మండలకేంద్రంలో చాకలి ఐలమ్మ జయంతిని రజక సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు నూతలకంటి రాజు, కుదురుపాక జనార్దన్, ప్రధాన కార్యదర్శి లొంక రాజు, సహాయ కార్యదర్శి రాచకొండ గణేష్, ప్రచార కార్యదర్శులు వేల్పుల సురేష్, రాచకొండ సోమయ్య, వేల్పుల శ్రీను, గౌరవ సలహాదారులు నూతలకంటి ముకుందం, చల్లగురుగుల తిరుపతి, గట్టికొప్పుల ఉపేందర్, పున్నెం వెంకటేశ్వర్లు, కొత్తకొండ శ్రీనివాస్, రమేష్, సభ్యులు పాల్గొన్నారు.

మహాలక్ష్మిగా దర్శనమిచ్చిన దుర్గాదేవి

ఏటూరునాగారం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఏటూరునాగారంలో గల శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. స్టార్ యూత్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఐదవ రోజు దుర్గాదేవి భక్తులకు మహాలక్ష్మి అవతారంలో దర్శనమిచ్చారు. దుర్గాదేవిని ఏకంగా రూ.15లక్షల విలువైన కరెన్సీ నోట్లు, దాదాపు 500 గ్రాముల బంగారు ఆభరణాలతో అలంకరించారు. అమ్మవారి దివ్యరూపాన్ని తిలకించడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలించ్చారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వైభవంగా సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు.

• మంగపేట(ఆంధ్రజ్యోతి) మండలంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగపేటకు చెందిన గార్లపాటి సత్యనారాయణ-సరోజన, గార్లపాటి శ్రీను-రాధిక దంపతులు అమ్మవారిని రూ.500, 200, 100, 50 కరెన్సీ నోట్లతో అలంకరింపజేశారు. అలాగే మండలంలోని ప్రముఖ ఆలయాల్లో అమ్మవారి విగ్రహాలను అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

వివిధ అలంకారాల్లో అమ్మవార్లు

మహదేవపూర్(ఆంధ్రజ్యోతి) : దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా ఐదో రోజు శ్రీకాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలోని శుభానంద దేవి అమ్మవారు శ్రీమహాలక్ష్మీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.. మహదేవపూర్‌లోని టస్సర్‌కాలనీ, దుబ్బగూడెంలో అమ్మవారు శ్రీలలితా త్రిపురాసుందరి అవతారంలో దర్శనమిచ్చారు. శుక్రవారం కావడంతో టస్సర్‌కాలనీ అమ్మవారి వద్ద కుంకుమ పూజలు, లలిత సహస్రనామ పారాయణం, అన్నదానాలు నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా భక్తులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఏటూరునాగారంలో [illegible]

గోదావరి ఉగ్రరూపం

(5వ పేజీ తరువాయి)

వద్ద ఉన్న జేచొక్కారావు దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టుల వద్ద గోదావరి నది భారీగా పెరిగి ప్రవహిస్తోంది. గత మూడు రోజులుగా ఎగువన కురుస్తున్న వర్షాలతో పాటుగా ఎగువన ఉన్న ప్రాజెక్టుల గేట్లు ఎత్తి దిగువకు నీళ్లు వదులుతుండటం, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రల నుంచి ప్రాణహిత, ఇంద్రావతి నదుల నుంచి భారీగా ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుండటంతో గంట గంటకు గోదావరి ప్రవాహం పెరుగుతోంది. శుక్రవారం సాయంత్రానికి ఎగువ నుంచి 8,23,530 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండటంతో బ్యారేజీలో ఎలాంటి నీటి నిల్వలు లేకుండా మొత్తం 59 గేట్లు ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు విడుదల చేస్తున్నారు. సమ్మక్క బ్యారేజీ వద్ద 82.75 మీటర్ల నీటి మట్టం నమోదైంది.



సమ్మక్క సాగర్ బ్యారేజి నుంచి దిగువకు వెళ్తున్న వరద నీరు

బిల్ట్ ఇంటెక్‌వెల్ వద్ద..

మంగపేట(ఆంధ్రజ్యోతి): మండలంలోని కమలాపురం బిల్ట్ ఇంటెక్‌వెల్ వద్ద గోదావరి శుక్రవారం ఉదయం నుంచి పెరుగుతోంది. సాయంత్రం 6 గంటల వరకు 83.5 ఫీట్ల వరకు చేరిందని కేంద్ర జలవనరుల శాఖ ఉద్యోగులు చెప్పారు. ఇంకా పెరిగే అవకాశం ఉందని అంచనా వేశారు. గోదావరి వరద పెరుగడంతో పాటు ఎర్రవాగు పొంగడంతో గోదావరి బ్యాక్ వాటర్ నిలిచిపోయింది. దీంతో వరి పంట, నారుమళ్లు నీట మునిగాయి. అదేవిధంగా మంగపేట, బోరునర్సాపురంల మధ్యలో గల ఎర్రవాగు వరద గోదావరి వరద పోటుకు గుర్రై బ్యాక్ వాటర్ నిలిచిపోయింది. అదేవిధంగా మల్లూరు, చుంచుపల్లి, వాడగూడెం, పాలాయిగూడెం, దేవనగరం, కత్తిగూడెం, అకినేపల్లి-మల్లారం తీరంలో కూడా వరద పెరిగి పంటలను ముంచాయి.

జంపన్నవాగుకు వరద ఉధృతి

ఏటూరునాగారం రూరల్(ఆంధ్రజ్యోతి): మండలంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జంపన్నవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. జంపన్నవాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో కొండాయి, మల్యాల, గోవిందరాజుల కాలనీ, ఎలిశెట్టిపల్లి గ్రామాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఏర్పాటు చేసిన పడవలు సైతం నడిచే పరిస్థితి లేదు. దీంతో బాహ్య ప్రపంచంతో ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అదేవిధంగా కొండాయి-ఊరట్టం గ్రామాల మధ్యలో భారీగా వృక్షాలు విరిగిపడడంతో రాకపోకలు సాగించలేని పరిస్థితులు నెలకొన్నాయి.



కాళేశ్వరం వద్ద గోదావరి ప్రవాహం

పేరూరు వద్ద నిలకడగా..

వాజేడు(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరూరు వద్ద గోదావరి శుక్రవారం నిలకడగా ఉంది. ఉదయం నుంచి పెరుగుతున్న గోదావరి సాయంత్రం 5గంటలకు 16.350 మీటర్ల నీటి మట్టానికి చేరుకుని నిలకడగా ప్రవహిస్తోంది. గోదావరి కాస్తంత తగ్గుతూ ఉండడంతో మిర్చి రైతులు ఊపిరి పీల్చుకుంటున్నారు.

కాళేశ్వరం వద్ద తగ్గుముఖం

మహదేవపూర్(ఆంధ్రజ్యోతి):మండలంలోని కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద గోదావరి ప్రవాహం తగ్గుముఖం పడుతోంది.. ఎగువనున్న గోదావరి, ప్రాణహిత నదుల నుంచి వరద కాస్త నెమ్మదించింది. దీంతో కాళేశ్వరం వద్ద గోదావరి నది 11.55 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తోంది.